
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

గురువారం 11 సెప్టెంబరు 2025



డయేరియా లక్షణాలతో బాధపడుతున్న బాలుడు



● అందాల సంయుక్త

నటి సంయుక్త మీనన్ బుధవారం నగరంలో సందడి చేసింది. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ప్రైవేట్ కార్యక్రమం పూర్తయ్యాక ఆమె అభిమానులతో ముచ్చటించారు.

డయేరియా కలవరం

న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కోరలు చాస్తోంది. ఏ ఇంట్లో చూసినా డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా వందల మంది మంచం పట్టారు. అనేక మంది వాంతులు, విరేచనాలు వంటి డయేరియా లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు మృతిచెందగా, 70 మందికి పైగా ఆసుపత్రుల్లో చేరారు. అనేక మంది వ్యాధి లక్షణాలతో బాధపడుతుండగా, అధికారులు మాత్రం చూసీచూడనట్టుగానే వ్యవహరిస్తున్నారు.

న్యూరాజరాజేశ్వరిపేటలో ఇద్దరు మృతి, 70 మందికి అనారోగ్యం

- చవితి పందిళ్లలో ఫుడ్ పాయిజనింగ్ అంటున్న అధికారులు
- మంచినీరు రంగుమారి వస్తోందని స్థానికుల ఆరోపణ
- కేర్ అండ్ షేర్ పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు
- మంచినీటి ట్యాంక్ క్లీనింగ్, పైపులైన్లకు మరమ్మతులు
- ఇంటింటి సర్వే చేపట్టిన వైద్యశాఖ సిబ్బంది





వాంతులు, విరేచనాలతో అపస్మారక స్థితికి చేరిన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మృతురాలు శ్రీరామ నాగమణి, లక్ష్మీకాంతం (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : న్యూ రాజరాజేశ్వరిపేటతో పాటు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డయేరియా నివారణకు చర్యలు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు మాత్రం చవితి పందిళ్లల్లో జరిగిన అన్నసమారాధన కార్యక్రమాల వలన ఫుడ్ పాయిజనింగ్ అయ్యి వాంతులు, విరేచనాలు అవుతున్నాయని చెబుతున్నారు. అయితే, స్థానికులు మాత్రం కలుషిత మంచినీటి కారణంగా ఇలా జరుగుతోందంటున్నారు.

ఫుడ్ పాయిజనింగ్ అంటున్న అధికారులు

ఇటీవల చవితి పందిళ్లలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమాలే ఈ వాంతులు, విరేచనాలకు కారణమని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. సమారాధన కార్యక్రమంలో భోజనాలు

మిగతా 6లో..

ప్రతి ఇంట్లోనూ బాధితులు

రాజరాజేశ్వరిపేటలో ఇప్పటి వరకు ఇద్దరు మహిళలు వాంతులు, విరేచనాలతో మృతిచెందారు. అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్న శ్రీరామ నాగమణి (61) గత మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో అనారోగ్యం బారిన పడింది. దీంతో ఆమెను సోమవారం నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ వెనుకవైపు ఉంటున్న కె.లక్ష్మీకాంతమ్మ (85) కూడా ఇవే లక్షణాలతో మూడు రోజుల క్రితం మృతి చెందింది. 70 మందికి పైగా డయేరియా లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో చిన్నపిల్లల నుంచి మహిళలు, వృద్ధులు కూడా ఉన్నారు. ప్రతి ఇంట్లోనూ ఇద్దరు నుంచి ముగ్గురు వరకు బాధపడుతున్నారు.

కేర్ అండ్ షేర్ పాఠశాలలో మెడికల్ క్యాంపు

న్యూ రాజరాజేశ్వరిపేటలో పదుల సంఖ్యలో ప్రజలు వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం అందుకున్న వైద్యశాఖ అధికారులు కేర్ అండ్ షేర్ పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఆశా వర్కర్లతో ఇంటింటి సర్వే చేపట్టారు.

కమిషనర్‌తో మాట్లాడిన మంత్రి నారాయణ 6

బాధితులను పరామర్శించిన కలెక్టర్



తిరువూరులో..

● జోరువాన

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. తిరువూరులో భారీగా కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి.

మిస్ విజయవాడ ఎంట్రీలకు ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ యువతులకు బంపర్ ఆఫర్. 'మిస్ విజయవాడ' పోటీల ఎంట్రీలకు 'విజయవాడ ఉత్సవ్-2025' నిర్వాహక కమిటీ ఆహ్వానం పలుకుతోంది. కళాశాల విద్యార్థినులు, యువతులు, మహిళలు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. విజయవాడ ఉత్సవ్ వెబ్‌సైట్‌లో ఈ ఎంట్రీలను ఆహ్వానిస్తున్నారు. ఈ పోటీలను మూడు కేటగిరీలుగా మిస్ టీన్ విజయవాడ, మిస్ విజయవాడ, మిస్సెస్ విజయవాడగా వీటిని నిర్వహించనున్నారు. 12-18 ఏళ్లలోపు వారికి మిస్ టీన్, 18-ఆపైబడిన వారికి మిస్ విజయవాడ పోటీలు జరుగుతాయి. 21 ఏళ్ల పైబడిన వివాహితులకు మిస్సెస్ విజయవాడ పోటీలు నిర్వహిస్తారు. పోటీలు ప్రిలిమినరీ రౌండ్, సెమీ, గ్రాండ్ ఫైనల్స్‌గా మూడు రౌండ్లలో జరుగుతాయి. గ్రాండ్ ఫైనల్స్‌లో విజేతలను నిర్ణయిస్తారు.

తరలనున్నరా లేదా?

దసరాకు వెళ్తామన్న కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ అసోసియేషన్

- ఇప్పటి వరకు స్పందించింది లేదు
- సకల సౌకర్యాలతో నున్న మార్కెట్ పూర్తి
- అయినా వెళ్లకుండా మీనమేషాలు
- దసరా నాటికి ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు
- ఇప్పటికైనా కదిలించాలని స్థానికుల వేడుకోలు



కేదారేశ్వరపేట మార్కెట్‌లో ఇరుకుగా ఎగుమతులు, దిగుమతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను నున్నకు తరలించడం ప్రహసనంగా మారింది. భారీ వాహనాల కారణంగా ఇక్కడ రోజూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈనెల 22 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 'విజయవాడ ఉత్సవ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేదారేశ్వరపేటలో పరిస్థితి ఇలాగే ఉంటే, ట్రాఫిక్ సంక్షోభం నెలకొనే పరిస్థితి ఉంది.

లారీలు, కంటైనర్లతో హడావిడి

రోజూ ఉదయాన్నే కేదారేశ్వరపేట మార్కెట్ వద్ద లారీలు, కంటైనర్లు సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్లపైనే వాహనాలను దిగుమతులు చేస్తుండటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. ఉదయం పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, వివిధ పనులపై బయటకు వచ్చే వారికి నరకం కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదు. అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవట్లేదు.

» అందుబాటులోనే నున్న మార్కెట్

బైపాస్ రోడ్డు వెంబడే నున్న పండ్ల మార్కెట్ పూర్తై ఉంది. 22 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. వంద అడుగుల రోడ్లు, డ్రెయినేజీలు, మరుగుదొడ్లు. ఇలా అన్ని వసతులు ఉన్నాయి. దసరా నాటికి వెళ్లిపోతామని కేదారేశ్వరపేట మార్కెట్ అసోసియేషన్ చెప్పినా ఇంతవరకు కదల్లేదు. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లో అసౌకర్యాల నడుమ అనేక ఇబ్బందులకోర్చి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారంతా నున్న వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నా. అసోసియేషన్ నాయకులు మాత్రం కదలనివ్వట్లేదు. షాపులను తమ నియంత్రణలో ఉంచుకుని ఎదురుతిరిగిన వారిని సాగనంపే కార్యక్రమాలు చేస్తుండటంతో తమ వ్యాపారాలు ఎక్కడ దెబ్బతింటాయోనని ఆందోళనతో వ్యాపారులు తప్పక కదలని పరిస్థితి ఏర్పడింది. విజయవాడ ఎంపీతో పాటు ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్, జిల్లా యంత్రాంగాలన్నీ కలిసి రంగంలోకి దిగకపోతే తప్ప మార్కెట్ ఇక్కడి నుంచి కదిలే పరిస్థితి లేదు.

రెండో భార్య కూతురు ఓ యువకుడితో ప్రేమాయణంలో ఉండటం ఆ తండ్రికి నచ్చలేదు. వద్దని వారించినా వినే పరిస్థితిలో కుమార్తె లేదు. కట్టలు తెంచుకున్న ఆవేశాన్ని ఆమెపై చూపించాడు. ఇనుప రాడ్డుతో కొట్టి చంపేశాడు. ఇందుకు మొదటి భార్య కూతుర్లు సాయం చేశారు. జిల్లాలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై పోలీసులు రహస్యంగా కూపీ లాగుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ప్రేమ పగ

రెండో భార్య కూతురిని చంపిన తండ్రి

- మృతదేహం అటవీ ప్రాంతంలో పడేసి పరార్
- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పట్టుకున్న పోలీసులు?
- నిందితుడు గంజాయి వ్యాపారి



విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మైలవరానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఐదుగురు కుమార్తెలు, రెండో భార్యకు ఒక కుమార్తె. అతడి జీవితంలోకి రెండో భార్య వచ్చాక మొదటి భార్య ముఖం చూపించకుండా వెళ్లిపోయింది. రెండో భార్యతో కలిసి గంజాయి విక్రయించడం అలవాటు చేసుకున్నాడు. ఇలా గంజాయి విక్రయిస్తున్న వీరిద్దరినీ పోలీసులు అరెస్టు చేసి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి పంపారు.

ఇనుప రాడ్డుతో కొట్టి హత్య

తల్లిదండ్రులిద్దరూ జైలుకు వెళ్లడానికి ముందు నుంచి వారి 14 ఏళ్ల కుమార్తె జి.కొండూరు మండలం గుంటుముక్కలకు చెందిన యువకుడితో ప్రేమాయణం నడుపుతోంది. తల్లిదండ్రులు జైలుకు వెళ్లాక వీరి ప్రేమ ముదిరింది. తండ్రి జైలు నుంచి వచ్చాక బాలికను ప్రేమిస్తున్న వ్యక్తిపై పగను పెంచుకున్నాడు. అతడి కారణంగానే తాను జైలుకు వెళ్లాల్సి వచ్చిందనుకున్నాడు. ఈ నేపథ్యంలో కూతురు, ఆ ప్రియుడు ఒక తోటలో ఉండగా చూశాడు. అతడితో తిరగొద్దని చెప్పినా ఎందుకు వినట్లేదని కూతురుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాను అతడితోనే ఉంటానని బాలిక ఎదురుచెప్పింది. ఆవేశంతో ఊగిపోయిన తండ్రి ఇనుప రాడ్డు బాలిక తలపై బలంగా కొట్టాడు. బాలిక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన జరిగే సమయానికి మొదటి భార్య ఐదుగురు కుమార్తెలా ఇంట్లోనే ఉన్నారు. వారంతా తండ్రికి సహకరించారు. రక్తం కనిపించకుండా నేలను శుభ్రంగా కడిగేశారు. రక్తపు వాసన

మిగతా 6లో..

చచ్చినా వదలరు!

జీజీహెచ్‌లోని పోస్టుమార్టంలో శవబేరాలు

- ప్రతి పనికీ ఓ రేటు కట్టి వసూళ్లు
- కుటుంబ సభ్యుల నుంచి డబ్బు డిమాండ్
- పంచనామాకు టోపీ చాస్తున్న పోలీసులు
- పేదలనూ వదలకుండా పీడిస్తున్న సిబ్బంది
- ప్రమాదాలు, ఆత్మహత్య మృతదేహాలకైతే మరీ ఎక్కువ



విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో జరిగే పోస్టుమార్టానికి వచ్చిన మృతదేహాల్లో ప్రమాదాలు, ఆత్మహత్యలు చేసుకున్నవే ఎక్కువ. ఆ సమయంలో కుటుంబ సభ్యుల బాధను ఎవరూ తీర్చలేరు. మానవత్వంతో వ్యవహరించాల్సిన పోస్టుమార్టం సిబ్బంది రాబందుల్లా డబ్బు కోసం వేధిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మృతదేహాన్ని నిల్వ చేయడానికి, వారికి కావాల్సిన వస్తువులు సమకూర్చడానికి అంటూ రకరకాల కారణాలు చెప్పి డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. అలాగే, గది శుభ్రం చేయడానికి, ఫొటోల కోసం అంటూ అనేక రకాల పేర్లు చెప్పి దండుకుంటున్నారు. ముఖ్యంగా ప్రమాదాలు,

మిగతా 6లో..

నెల కిందట నగరంలోని రాణిగారితోటకు చెందిన ఓ భవన నిర్మాణ కార్మికుడు విధులు నిర్వహిస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసు కేసు నమోదుకావడంతో పోస్టుమార్టానికి తరలించారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారి వద్ద అక్కడి సిబ్బంది డబ్బు డిమాండ్ చేశారు. రూ.7 వేలు ఇస్తేనే పోస్టుమార్టం చేస్తామని చెప్పడంతో పేదరికంలో ఉన్న ఆ కుటుంబం రూ.4 వేలు ఇచ్చి పోస్టుమార్టం చేయించుకుంది.

వారం కిందట ఇబ్రహీంపట్నానికి చెందిన యువకుడు వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు కావడంతో యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. చేతికి అందివచ్చిన కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కుమిలిపోయారు. పోస్టుమార్టం చేయాలంటే రూ.8 వేలు అవుతుందని సిబ్బంది నిర్మొహమాటంగా అడగడంతో పక్కనే ఉన్న మృతుడి స్నేహితులు సుమారు రూ.5 వేలు ఇచ్చి పోస్టుమార్టం చేయించుకున్నారు.

..ప్రాణం పోసేవాడు డాక్టర్. ప్రాణంపోయినా పీక్కుతినే వాళ్లను ఏమంటారు. పైగా కటిక పేదరికాన్ని అనుభవించే పేదలను పిండేసే వాళ్లను ఏమని పిలవాలి. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం వద్ద రోజూ శవాలపై జరిగే పైశాచిక వ్యవహారాలివి. పోస్టుమార్టానికి ఓ రేటు, పంచనామాకు మరో రేటు, ఫొటోలు తీసేందుకు కొంత, మృతదేహాన్ని నిల్వ చేసేందుకు ఇంకొంత.. ఇలా అందినకాడికి దండుకుంటున్నారు. అసలే ఇంటి మనిషిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారికి ఈ దోపిడీ మరింత కుంగదీస్తోంది.



ఆన్‌లైన్ మోసాలకు చెక్

- అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌కు అనూహ్య స్పందన
- ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సెమీఫైనల్స్ పోటీలు 6
- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది విద్యార్థుల హాజరు
- పది థీమ్స్‌పై సమస్యల పరిష్కారానికి పోటీపడిన విద్యార్థులు

ఆన్‌లైన్ మోసాలకు చెక్

» అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌కు అనూహ్య స్పందన
» ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సెమీఫైనల్స్ పోటీలు
» మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది విద్యార్థులు హాజరు
» పది థీమ్స్‌పై సమస్యల పరిష్కారానికి పోటీపడిన విద్యార్థులు


ధనేకుల ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెమీ ఫైనల్ పోటీలకు హాజరైన విద్యార్థులు

కానూరు/పెనమలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాక్‌థాన్-2025 సెమీఫైనల్ పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. గంగూరులోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం జరిగిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 30 కళాశాలలు, పలు విశ్వవిద్యాలయాల నుంచి 60 విద్యార్థుల జట్లు హాజరయ్యాయి. ఒక్కో జట్టులో ఆరుగురు చొప్పున 60 జట్లలో మొత్తం 360 మంది ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ 60 జట్లకు క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన పది థీమ్స్‌ను సమస్య పరిష్కారానికి ఇచ్చారు.

ఆన్‌లైన్ మోసాలను ముందే గుర్తించేలా..

బ్యాంక్ అకౌంట్స్ క్రెడిట్ కార్డు, ఆర్థిక, ఆన్‌లైన్ మోసాలను ముందే గుర్తించి ఏవిధంగా బయటపడచ్చో చెప్పే థీమ్‌ను విద్యార్థులు ఇక్కడ ప్రదర్శించారు. ఇది క్వాంటమ్ క్యాంపిటింగ్ ద్వారానే సాధ్యమని విద్యార్థులు పేర్కొన్నారు. మోసం జరిగి డబ్బుల రికవరీకి కష్టపడటం కన్నా ముందే మోసాన్ని గుర్తించి ఏవిధంగా జాగ్రత్త పడవచ్చో విద్యార్థులు వివరించారు. అదేవిధంగా ట్రేడింగ్, షేర్లు, ఇన్వెస్ట్‌మెంట్ తదితర వాటి నుంచి తక్కువ రిస్కులో ఎక్కువ బెనిఫిట్ ఏవిధంగా పొందాలో విద్యార్థులు చేసి చూపించారు. ఇలాంటి థీమ్స్‌తో అనేక అంశాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

ఫైనల్స్‌కు 20 టీమ్స్‌లు ఎంపిక

త్వరలో జరిగే అమరావతి క్వాంటమ్‌వాలీ హ్యాకథాన్-2025 ఫైనల్ పోటీలకు ఇక్కడ హాజరైన 60 జట్లలో ఉత్తమంగా ఎంపికైన 20 జట్లను పంపనున్నారు. ఒక్కో థీమ్ నుంచి రెండుజట్లు చొప్పున మొత్తం 20 జట్లను ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపిక చేశారు.

ఆన్‌లైన్ మోసాల నుంచి బయపడవచ్చు


- ఆర్.సందీప్‌కుమార్, పీవీపీ సిద్ధార్థ

ఆన్‌లైన్ మోసాల నుంచి ముందే ఏవిధంగా బయటపడవచ్చునో మా టీమ్ సమస్య పరిష్కారంలో భాగంగా నిరూపించింది. దీనివల్ల మోసాలను ముందే గుర్తించవచ్చు. ఇది అందరికీ ఎంతో ఉపయోగం. ఈకార్యక్రమంలో ఎన్నో కొత్త విషయాలను తాము నేర్చుకున్నాం.

క్షేత్రస్థాయి అంశాలను తెలుసుకున్నా


- జి.వర్షిత, విజ్ఞాన్ యూనివర్సిటీ

అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్-2025 సెమీఫైనల్స్ పోటీలకు హాజరుకావడం వల్ల క్షేత్రస్థాయిలో అనేక అంశాలను తెలుసుకోగలిగాం. తమ బృందం క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం ద్వారా పలు సమస్యలకు ఏవిధంగా పరిష్కారం చూపవచ్చో చెప్పింది.

ఉద్యోగ కల్పనకు సహాయకారి


- పి.శ్రీహాసిని, వీఆర్ సిద్ధార్థ

రానున్న రోజుల్లో ఉద్యోగ కల్పనకు క్వాంటమ్ కంప్యూటింగ్ ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నా. క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం వల్ల అన్ని అంశాలల్లో సమయం, డబ్బును ఆదా చేయవచ్చు. దీనిపై మరింతంగా అధ్యయనం చేస్తాం. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది.

పలు ప్రాజెక్టులను అధ్యాయనం చేశాం


- పాటిబండ్ల నవ్య, ట్రిపుల్ ఐటీ (ఒంగోలు)

సెమీ ఫైనల్స్‌లో పది అంశాలపై ఏర్పాటుచేసిన పలు సమస్యల పరిష్కారం ప్రాజెక్టులను అధ్యయనం చేశా. నిజజీవితంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉద్యోగ రూపకల్పనకు కూడా దోహదపడుతుంది.

క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఎదగాలి


- డీకేఆర్‌కే రవిప్రసాద్, ధనేకుల డైరెక్టర్

క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులు ఎదిగినప్పుడు వారి భవిష్యత్ బంగారుబాటగా ఉంటుంది. సీఎం చంద్రబాబు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ముందుకు తీసుకువెళుతున్నారు. సెమీఫైనల్స్‌కు తమ కళాశాలను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం


- రవి కడియాల, ధనేకుల ప్రిన్సిపాల్

క్వాంటమ్ కంప్యూటింగ్ వివిధ ఆవిష్కరణలకు ప్రోత్సాహకంగా ఉంటుంది. హ్యాకథాన్-2025 కేవలం ఒక పోటీ మాత్రమే కాదు, ఒక ఉద్యమం. క్వాంటమ్ ఆలోచనపరులు, ఆవిష్కర్తలను తీర్చిదిద్దే చైతన్యవంతమైన సమాజ నిర్మాణ దిశగా అడుగులు వేస్తోంది.

జిల్లాను క్రీడల్లో నెంబర్ వన్‌గా నిలపాలి

● కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదం చేస్తాయని, సాంస్కృతిక, సామాజిక అంతరాలను తొలగించేందుకు ఉపయోగపడతాయని, రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర స్పోర్ట్స్ విజన్‌కు అనుగుణంగా సమష్టి కృషితో ఎన్టీఆర్ జిల్లాను క్రీడల్లో నెంబర్ వన్‌గా నిలబెడదామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన క్రీడాకారులు పతకాలు సాధించేందుకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను, క్రీడా విధానం విశిష్టతను ఔత్సాహికులకు వివరించేందుకు ఇగ్నైట్ సెల్‌లో అందుబాటులో ఉంచిన ప్రచార సామగ్రితో పాటు వాటర్ స్పోర్ట్స్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ తదితర క్రీడలకు సంబంధించిన సామగ్రిని ప్రదర్శించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, వివిధ క్రీడల కోచ్‌లు పీ రవికుమార్, కే భాస్కర్, కే జగదీష్, ఎస్ సంతోష్‌కుమార్, ఎస్‌కే రియాజ్, ఎస్‌కే ముంతాజ్ బేగం, కే స్వామి, కే చిరంజీవి, నాగేశ్వరరావు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.



బాణాన్ని ఎక్కుపెడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రగతి సూచికలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా వివిధ విభాగాల కీలక ప్రగతి సూచికల (కేపీఐ) పురోగతిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన 4 సూచికలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది, ఉద్యాన శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనిదినాల కల్పన, సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించడానికి సంబంధించిన అంశాల్లో నిర్దేశించిన నెలవారీ, త్రైమాసిక, వార్షిక లక్ష్యాలను చేరుకొనేందుకు అధికారులు సమష్టిగా కృషిచేయాలన్నారు. సగటు వేతనం రూ.307 ఉపాధి హామీ శ్రామికులకు అందేలా ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారు. మండలాల వారీగా లేబర్ మొబిలైజేషన్, సీసీ రహదారుల నిర్మాణం, పశువుల షెడ్లు, జీవాల షెడ్ల నిర్మాణం, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం తదితరాలపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో డ్వామా పీడీ ఏ రాము తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ట్యాక్స్ రిటర్న్స్ తప్పనిసరి

» జిల్లా జనరల్ సెక్రటరీ బి.విష్ణువర్ధనరావు

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐటీ పరిధిలోని పెన్షనర్లు తప్పకుండా 2024-25కు సంబంధించిన ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలని జిల్లా జనరల్ సెక్రటరీ బి.విష్ణు వర్ధనరావు తెలిపారు. నగరంలోని పెన్షనర్స్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐటీ నుంచి మినహాయింపు పొందిన పెన్షనర్లందరూ నగరంలోని తూర్పు సబ్‌ట్రెజరీ వద్ద ఫార్మ్ 16ను పాన్‌కార్డు చూపించి తీసుకోవాలన్నారు. ట్యాక్స్ పడని పెన్షనర్లు కూడా రూ.7.50 లక్షల వార్షిక ఆదాయం వారికి రూ.3.50 లక్షల వరకు ట్యాక్స్‌లో మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. దీనికోసం టాక్స్ పడనివారు కూడా నిల్ రిటర్న్స్ ఫైల్ చేయాలన్నారు. పెన్షనర్లకు ఇబ్బందిలేకుండా ఆడిటర్‌ను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. ఇప్పటివరకు సుమారు 450 మందికి రిటర్న్స్ ఫైల్ చేయడం జరిగిందన్నారు. సైబర్ నేరగాళ్లు ఫేక్‌కాల్స్ చేసి పీపీఓ, ఆధార్, ఐడీ నెంబర్లు అడిగితే ఎవరూ ఇవ్వవద్దని సైబర్‌క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త నెంబర్ల నుంచి ఫోన్ వచ్చి ఓటీపీ, బ్యాంకుఖాతా, ఆధార్, పాన్ కార్డు వివరాలు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి. ఎవరు ఫోన్‌చేసినా పెన్షనర్లు వారికి సంబంధించిన సమాచారం ఇవ్వవద్దు. పొరపాటున ఇస్తే అకౌంట్లలోని డబ్బుమొత్తం ఖాళీ అవుతుందన్నారు.

అధునాతన వైద్యం.. అత్యున్నత ప్రమాణాలే లక్ష్యం

» శ్రీ వెంకటేశ్వర వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్దయ్య


శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్యను సన్మానిస్తున్న హెల్త్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి తదితరులు

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వైద్యవిద్యలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యంగా వైద్యులు కృషిచేయాలని శ్రీ వెంకటేశ్వర వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్దయ్య అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో 'అధునాతన టెక్నాలజీ-వైద్యవిద్య-జాతీయవిద్యావిధానం-2020'పై ఆన్‌లైన్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఇతర కాలేజీల నిర్వహణమండలి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ, కృత్రిమ మేధ, ఏఐటూల్స్ వంటివి ఉపయోగించుకుని సులభంగా వైద్యసేవలు అందించే సృజనాత్మక టెక్నాలజీ నేడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మెడికల్ కాలేజీల్లో ల్యాబులు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర మౌలిక వసతులు పెంచడంతో రోగులకు సాంత్వన ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సిద్ధయ్య పేర్కొన్నారు. అధిక సంఖ్యలో శస్త్రచికిత్సలు, ప్రజలకు వైద్యసేవలు చేరువగా తీసుకురావడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. జాతీయ వైద్య కమిషన్(ఏఎంసీ) కూడా ఆ దిశగా కృషిచేస్తోందన్నారు. రోగులతో వైద్యుడు వ్యవహరించాల్సిన తీరుతోపాటు నైతికతను ఒక అంశంగా వైద్యవిద్యలో చేర్చారని, వైద్యవిద్య పూర్తిచేసుకుని బయటకు వచ్చే విద్యార్థి మంచి వైద్యుడిగా సేవలందించడానికి ఇది ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం కేవలం థియరీ పరీక్షలతోఎంబీబీఎస్ పూర్తిచేయడమే కాకుండా ప్రాక్టీస్‌లోని అనేక అంశాల్లో విద్యార్థులు సామర్థ్యం పెంచుకోవడం చాలా కీలకమన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ ప్రీక్లినికల్ ట్రైనింగ్‌ను క్లినికల్ ట్రైనింగ్‌లో భాగం చేశారని తెలిపారు. మెడికల్ కాలేజీల్లో స్కిల్‌ల్యాబ్‌లను తప్పనిసరి చేశారన్నారు. రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ, యూనివర్సిటీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా మెడికల్ కాలేజీల యాజమాన్యాలు నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్(అకడమిక్) కె.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో టాపర్..
ఆవేశంతో జైలు పాలు


ప్రొఫెసర్‌పై దాడి అనంతరం నిర్బంధంలో ఉన్న వినయ్ పురుషోత్తమ్

నూజివీడు టౌన్ - ఆంధ్రజ్యోతి: పుట్టింది నిరుపేద కుటుంబం.. చిన్నతనం నుంచే చదువుపట్ల ఎనలేని మమకారం.. ఏ పరీక్ష రాసినా టాపర్‌గా నిలిచే సత్తా.. ఓ వైపు సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంటూనే... మరోవైపు ఎంటెక్ చదువుతున్న ఆ విద్యార్థి ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టేవాడు. అలాంటి యువకుడు క్షణికావేశంలో ప్రొఫెసర్‌పై కత్తితో దాడి చేసి చివరకు జైలు పాలయ్యాడు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వడ్డిగూడేనికి చెందిన మద్ది వినయ్ పురుషోత్తమ్ ఆవేశంతో తన కెరీర్‌ను చేజేతులా నాశనం చేసుకున్నాడు. సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తిచేసిన వినయ్.. ప్రతిష్టాత్మక రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్టైపండ్ తీసుకుంటూ ఎంటెక్ చదవొచ్చనే ఆశతో ఎంట్రన్స్ రాశాడు. ఇందులో టాపర్‌గా నిలిచి క్యాంపస్‌లో సీటు సాధించాడు. మరోవైపు సివిల్స్ రాసి ఉన్నతోద్యోగం సాధించాలనే ఆశతో కోచింగ్ సెంటర్‌లో శిక్షణ కూడా తీసుకుంటున్నాడు. అటు కోచింగ్ ఇటు ఎంటెక్ క్లాసులు రెండింటికీ న్యాయం చేయలేకపోతుండడంతో... తన పరిస్థితిని యాజమాన్యానికి వివరిస్తూ ప్రథమ సెమిస్టర్‌లో ఒకటి, రెండు నెలలు తనకు హాజరు నుంచి వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశాడు. అందుకు అధికారులు ఆమోదం తెలపడంతో అటు కోచింగ్‌కు వెళ్తూనే వీలు చిక్కినప్పుడల్లా ఎంటెక్ క్లాసులకు హాజరయ్యేవాడు. మొదటి సెమిస్టర్‌లో 55 శాతం హాజరు మాత్రమే ఉన్నప్పటికీ ప్రత్యేక అనుమతితో పరీక్షలు రాసి ఆ విభాగంలో టాపర్‌గా నిలిచాడు. అయితే.. ఆ తర్వాత ఏమైందో కానీ.. రెండో సెమిస్టర్‌లో ఒక్కరోజు కూడా తరగతులకు హాజరు కాలేదు. దీంతో ఎంటెక్ కో ఆర్డినేటర్‌గా ఉన్న ప్రొఫెసర్ గోపాలరాజు దీనిపై అభ్యంతరం తెలుపుతూ.. పరీక్షలకు హాజరు కావాలంటే హెచ్‌వోడీ అనుమతులు కావాలని పేర్కొన్నారు. దీంతో సోమవారం హెచ్‌వోడీ అనుమతుల కోసం వెళ్లి వచ్చే క్రమంలో జరిగిన పరిణామాలతో.. కోపోద్రిక్తుడైన వినయ్ తనతోపాటు తెచ్చిన కత్తితో పరీక్ష హాలులో గోపాలరాజుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గోపాలరాజు తీవ్ర గాయాలపాలయ్యారు. తోటి విద్యార్థులు వినయ్‌ను అడ్డుకుని గోపాలరాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. బీదరికంలోనూ చదువులో టాపర్‌గా నిలుస్తూ వచ్చిన వినయ్.. క్షణికావేశం చివరకు హత్యాయత్నం కేసులో ముద్దాయిగా నిలిచేలా చేసింది.

ప్రేమ పగ

(5వ పేజీ తరువాయి)

రాకుండా బ్లీచింగ్ చల్లారు.

పక్కింటి వ్యక్తి ఆటోలో..

మృతదేహం తరలింపునకు పక్కింటి వ్యక్తి ఆటోను ఉపయోగించుకున్నాడు. చంద్రగూడెం వరకు వెళ్లొస్తానని ఆటో తీసుకున్నాడు. ఆ ఆటో లో కుమార్తె మృతదేహాన్ని తీసుకెళ్లి ఎ.కొండూరు అటవీ ప్రాంతంలో పడేశాడని తెలిసింది. తర్వాత ఆటోను శుభ్రంగా కడిగేసి పక్కింటి వ్యక్తికి అప్పగించాడు. ఈ ఘటన గతనెల 31న జరిగినట్టు తెలుస్తోంది. ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచా రం ఇచ్చారు. ఘటన జరిగాక నిందితుడు, మొద టి భార్య కుమార్తెలు తలోదిక్కుకు పారిపోయారు. మన్యం ప్రాంతంలో తలదాచుకుంటున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మృతదేహం తరలింపునకు ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ఎ.కొండూరు అటవీ ప్రాంతానికి వెళ్లి గాలించగా, అక్కడ బాలిక మృ తదేహం కనిపించలేదని తెలిసింది. తండ్రిని ర హస్యంగా విచారణ చేస్తున్న పోలీసులు మొదటి భార్య, పిల్లల కోసం గాలిస్తున్నారని సమాచారం.

ఛత్తీస్‌గఢ్‌లో ఏపీ డ్రోన్లు

కుమార్తెను చంపాక నిందితుడు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని మన్యం ప్రాంతానికి పారిపోయాడు. అతడిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులు డ్రోన్లకు పని చెప్పారు. నిందితుడు ఛత్తీస్‌గఢ్ పారిపోయాడని తెలుసుకున్న పోలీసులు తమ వద్ద ఉన్న రెండు డ్రోన్లతో ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వాటిని ఎగురవేసి నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు.

డయేరియా కలవరం

(5వ పేజీ తరువాయి)

తెచ్చుకుని, ఇంట్లో నిల్వ ఉంచుకుని, మరునటి రోజూ అదే భోజనం చేయడం వల్ల వాంతులు, విరేచనాలు అవుతున్నాయంటున్నారు. స్థానికులు మాత్రం పది రోజుల నుంచి మంచినీరు దుర్వాసన వచ్చి, రంగు మారిందని, ఆ కారణంగానే ప్రజలు డయేరియా బారిన పడుతున్నారని చెబుతున్నారు.

మంచినీటి ట్యాంక్ క్లీనింగ్,పైపులైన్లకు మరమ్మతులు

వ్యాధి ప్రబలిన ప్రాంతాల్లో మంచినీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తు న్నారు. అయితే, మంచినీటి పరీక్షల్లో ఎటువంటి వ్యాధి కారకాలు లేవని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. వ్యాధి వ్యాప్తి చెందిన తర్వాత అధికార యంత్రాంగం హడావిడి చర్యలు చేపట్టింది. పైపులైన్లకు లీకులు ఉన్నాయని మరమ్మ తు చర్యలు చేస్తున్నారు. అలాగే, పాఠశాల పక్కనే ఉన్న మంచినీటి రిజర్వాయర్‌ను కూడా శుభ్రపరచాలని అధికారులు సిబ్బందికి సూచించారు. అయితే, పైపులైన్లకు లీకుల కారణంగానే అనారోగ్యం పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

కమిషనర్‌తో మాట్లాడిన మంత్రి నారాయణ

కార్పొరేషన్: డయేరియా కేసులపై వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో మునిసిపల్ మంత్రి నారాయణ ఫోన్‌లో మాట్లాడారు. న్యూ ఆర్ ఆర్ పేటకు కార్పొరేషన్ తాగు నీటి సరఫరాను తక్షణం నిలిపివేయాలని మంత్రి నారాయణ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

బాధితులను పరామర్శించిన కలెక్టర్

డయేరియాతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యూ రాజరాజేశ్వరిపేట బాధితులను కలెక్టర్ లక్ష్మీశ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డయేరియా బారిన పడిన వారంతా హాస్పిటల్‌లో క్షేమంగానే ఉన్నారన్నారు.

చచ్చినా వదలరు!

(5వ పేజీ తరువాయి)

ఆత్మహత్యలు చేసుకుని పోలీసు కేసు నమోదై పోస్టుమార్టానికి వచ్చే మృతుల కుటుంబసభ్యుల నుంచి అధికమొత్తంలో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

పంచానామాకు

పోస్టుమార్టం అనంతరం మృతుడి కుటుంబీకులకు పంచనామా పోలీసులే ఇవ్వాలి. ఈ పంచనామా ఇస్తేనే ప్రమాదాలు జరిగిన వారికి బీమా, ఇతర పాలసీల ద్వారా రావాల్సిన డబ్బు జమ అవుతుంది. ఇలాంటి సందర్భాల్లో పోస్టుమార్టం సిబ్బందితో కలిసి పోలీసులూ డబ్బు తీసుకుంటున్నారని మృతుల కుటుంబీకులు, స్నేహితులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు డబ్బు ఇవ్వకపోతే పంచనామా ఏ విధంగా రాస్తారోనని భయపడి అడిగినంత ముట్టజెబుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారైతే పర్వాలేదు కానీ, పేదవారు మాత్రం సిబ్బందికి, పోలీసులకు అడిగినంత ఇవ్వలేక బేరాలు మాట్లాడుకుంటున్నారు.

దుఃఖంలో ఉన్నవారి వద్ద దండుకుంటున్నారు : మృతుడి స్నేహితుడు అర్జున్

ఇంట్లో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోతే కుటుంబీకులు ఎంత దుఃఖంలో ఉంటారో అందరికీ తెలుసు. అందులోనూ వయసులో ఉన్నవారు చనిపోతే ఆ బాధ వర్ణనాతీతం. అటువంటి వారి వద్ద నుంచి డబ్బు వసూలు చేయడం దుర్మార్గం. ప్రభుత్వాలు జీతాలు చెల్లిస్తున్నా శవాలపై దండుకుంటున్నారు. ఆర్థికంగా ఉన్నవారు బాధలో పట్టించుకోరు. అంత మొత్తంలో అంటే పేదలు ఎలా ఇచ్చుకోగలరు. ఈ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.


బాలికలతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

బాలికలకు ఎలుకలతో గాయాలపై జేసీ ఆరా

● కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ ● మెనూపై ఆగ్రహం

ఎ.కొండూరు, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలల్లో బాలికలకు సరైన విద్య, ఆహారం అందజేయకపోతే సిబ్బందికి శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా హెచ్చరించారు. మంగళవారం ఎ.కొండూరు కేజీబీవీ పాఠశాలను జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో కొన్ని రోజులుగా కొందరు బాలికలను ఎలుకలు కొరికి గాయపరుస్తున్నాయి. నిద్రపోవాలంటేనే భయం, భయంగా గడుపుతున్నారు. ఈ విషయంపై జేసీ వివరాలు తెలుసుకున్నారు. తక్షణం కిటికీలకు మెస్ ఏర్పాటు, ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాయాలైన పిల్లలకు పాఠశాలలోని వైద్యం చేసి మందులు అందజేయాలన్నారు. గతంలో దాతలిచ్చిన వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో, పిల్లలు బోరులోని నీరు తాగుతున్నారు. ఈ వాటర్ ప్లాంట్ రిపేరు చేయించాలని ఆదేశించారు. బాలికలకు మెను ప్రకారం ఆహారం అందజేయడం లేదని, పప్పు, కూరగాయలు, పండ్లు, ఆహారం అందజేయాలని, మెను ప్రకారం ఇవ్వాలన్నారు. అనంతరం క్లాస్ రూమ్స్, స్టాక్‌ను పరిశీలించారు. తిరువూరు ఆర్డీవో కే మాధురి, తహసీల్దార్ కే లక్ష్మీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో కే కేశవరావు, ఇన్‌చార్జి ఎస్‌వో శ్యామల పాల్గొన్నారు.


దేవదాయ శాఖ రెవెన్యూ కార్యదర్శి హరి జవహర్‌లాల్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ శాఖ
రెవెన్యూ కార్యదర్శి హరి జవహర్‌లాల్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గగుడిలో కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం దేవదాయ శాఖ నూతన రెవెన్యూ కార్యదర్శి హరి జవహర్‌లాల్ దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్, అర్చకులు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వారికి ఆశీస్సులు అందజేయగా ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు వీ శివప్రసాద్ శర్మ వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు. దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఆయన విధులు స్వీకరించారు.

రైల్వేస్టేషన్ 6వ నెంబరు ప్లాట్‌ఫారంలో
ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం


ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన పోస్టుమాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధర్ మూర్తి

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ 6వ నెంబరు ప్లాట్‌ఫారంలోని ఆర్ఎంఎస్ వై - డివిజన్ నేషనల్ సార్టింగ్ హబ్ కార్యాలయంలో బుధవారం పోస్టుమాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధర్ మూర్తి ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. డివిజన్ సూపరింటెండెంట్ జీవీ బాల సరస్వతి మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రం రైల్వే స్టేషన్‌లో ప్రారంభించటం వల్ల ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. కొత్త ఆధార్ నమోదు, సవరణలకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. ఆర్ఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో
ఎస్సీ వర్గీకరణ చట్టం చేయాలి

● పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి మాదిగలకు 7శాతం మొదటి వరుసలో ఇచ్చేలా చట్టం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ విజ్ఞప్తి చేశారు. మాదిగల మహోద్యమ సభ సన్నాహక సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో చట్టం చేసిన వెంటనే చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ జింఖానా గ్రౌండ్స్‌లో నవంబర్ 18న మాదిగల విజయోత్సవ సభ నిర్వహిస్తామన్నారు. జయప్రదం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మాదిగలకు పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, అధికార ప్రతినిధి త ప్పట హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్, కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సృజనరావు, నేతలు ఆలేటి ఏసుపాదం, కే బుజ్జిబాబు పాల్గొన్నారు.



చేతులెత్తి సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

గ్రంథాలయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి

ధర్నాచౌక్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న గ్రంథాలయ పోస్టులను భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి 2 లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి పోరాడుతామన్నారు. డీవైఎఫ్ఐ, ఏపీ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఏపీ గ్రంథాలయ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీ రామన్న, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కార్యదర్శి లక్ష్మయ్య, ఏపీ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ కే జగదీశ్ మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ సెస్‌ను జమ చేయాలని, పంచాయతీ, మున్సిపాల్టీ, కార్పొరేషన్లలో ప్రజల నుంచి వసూలు చేసే పన్నులు నేరుగా గ్రంథాలయాల సంస్థల ఖాతాల్లో జమయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయాలని కోరారు. గ్రంథాలయాల్లోని అన్ని పోస్టులను గ్రంథాలయ విద్యను అభ్యసించిన వారితోనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ నేతలు పీ కృష్ణ, పిచ్చయ్య, కృష్ణకాంత్, లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ నేతలు రమేష్, రమణాప్ప, శ్రీకాంత్‌బాబు, ఉష పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థి తిథి సందర్భంగా బుధవారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. గణపతికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వేదోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని గణేశుడికి పూజలు చేశారు.



కంపాక్టర్ బిన్ పరిశీలిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించండి

● నగర కమిషనర్ ధ్యానచంద్ర

భారతీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ బుధవారం లయోల కళాశాల రోడ్డు, క్రీస్తురాజుపురం, పంట కాలువ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని కంపాక్టర్ బిన్ లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. నగరంలోని రోడ్లలో గుంతలు పూడ్చాలని తెలిపారు. ప్రధాన రహదారుల్లో డివైడర్ల వద్ద సక్రమంగా పారిశుధ్య నిర్వహణ జరిపించాలని అధికారులకు తెలిపారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పుల్లేటికట్ట ఆక్రమణల తొలగింపు ప్రారంభం

● 37మందికి నోటీసులు జారీ ● ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ ఇళ్ల కేటాయింపు

గుణదల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుల్లేటికట్ట డ్రెయిన్ విస్తరణకు ఎట్టకేలకు నగర పాలకసంస్థ ఒక అడుగు ముందుకు వేసింది. పుల్లేటికట్ట డ్రెయిన్ వెంబడి ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి గుణదల సెంటర్ వద్ద రైవస్ కాల్వలో డ్రెయిన్ కలిసే వరకు డ్రెయిన్ వెంబడి ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా ముందుగా డ్రెయిన్‌లో పూడిక తీయడానికి కూడా వీలులేని విధంగా ఉన్న ఆక్రమణలను తొలగించే పని ప్రారంభించారు. గుణదల సెంటర్ నుంచి ఈఎస్ఐ వరకు డ్రెయిన్ వెంబడి ఉన్న ఆక్రమణల్లో ప్రధానంగా ఇప్పటికే 37 మందికి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారికి జక్కంపూడిలో ప్రభుత్వ గృహాలను మంజూరు చేయనున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి పుల్లేటికట్ట డ్రెయిన్ గతంలో ఉన్న మాదిరిగా కాకుండా నేరుగా గుణదల ఆంజనేయస్వామి ఆలయం వరకు తీసుకొచ్చి అక్కడ నుంచి గుణదల రైవస్ కాల్వలోకి కలిసేలా డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆక్రమణల తొలగింపు అనంతరం ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి గుణదల సెంటర్ వరకు డ్రెయిన్‌ను 10 నుంచి 12 అడుగుల మేర విస్తరణ చేయాలని అధికారులు భావిస్తున్నారు.

అదే సమయంలో డ్రెయిన్ నిర్మాణం అనంతరం పూడిక తీసేందుకు వీలుగా ఇరుపక్కల ఆరు అడుగుల మేర ఖాళీ ఉండేలా చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. పట్టా కాని భూములను పూర్తిగా వీఎంసీ తన ఆధీనంలోకి తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. దీనికి తోడు గుణదల నుంచి బెంజిసర్కిల్, మహానాడు రోడ్డు వైపు వెళ్లే వారంతా గుణదల పుల్లేటికట్ట రోడ్డువైపుగా ప్రయాణాలు కొనసాగిస్తుండటంతో ఇటువైపు ట్రాఫిక్ పెరిగిపోయింది. పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా పుల్లేటికట్ట రోడ్డులేదు. ఆ సమస్యను కూడా పరిష్కరించడానికి నగరపాలకసంస్థ అధికారులు ఆలోచనలో ఉన్నారు.



గుణదల మెయిన్ రోడ్డు నుంచి, పుల్లేటికట్ట రోడ్డు వైపు నుంచి తొలగించిన ఆక్రమణలు

37 మందికి నోటీసులు జారీ చేశాం: మోహన్‌బాబు

పుల్లేటికట్ట డ్రెయిన్‌ను విస్తరించడానికి అడ్డుగా ఉన్న నిర్మాణాల్లో 37మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని అసిస్టెంట్ సిటీప్లానర్ మోహన్‌బాబు తెలిపారు. ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి గుణదల సెంటర్ వద్దగల రైవస్ కాల్వ అండర్‌పాస్ డ్రెయిన్ వరకు ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని నిర్ణయించాం. పట్టా కాని భూములను పూర్తిగా తొలగించేందుకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ ఇళ్లను కేటాయించడం జరుగుతుంది. త్వరలోనే డ్రెయిన్ విస్తరణ పనులు ప్రారంభిస్తాం.

గ్రాము కొకైన్ పట్టివేత

పెనమలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప శ్రీనివాసనగర్ కట్టకు చెందిన నక్క పార్థసారథి గ్రీన్‌స్పేస్ అపార్టుమెంట్ ఎదురుగా నివాసం ఉంటాడు. ఇతనికి గంజాయి సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో తన స్నేహితుడు నాగవరపు గుణశేఖర్ పదిహేనురోజుల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చి తనకు ఐదువేల విలువైన ఒక గ్రాము కొకైన్ ప్యాకెట్ అమ్మమని ఇచ్చినట్లు తెలిపాడు.

నిందితుని మీద అనుమానంతో అతడిని తనిఖీ చేయగా కొకైన్ ప్యాకెట్ లభించిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మానస



మాట్లాడుతున్న లయన్ అంజనేయులు



ప్రసంగిస్తున్న అబ్దుల్ బాసిత్

ప్రతి సమస్యకు చావు పరిష్కారం కాదు

భారతీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఐక్యూఏసీ , మాజిక్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానసిక నిపుణులు, మానస చైల్డ్ గైడెన్స్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ మానస ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి సమస్యకు చావు పరిష్కారం కాదన్నారు. తొందరు పాటు నిర్ణయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ప్రిన్సిపాల్ మహేష్, ఐక్యూఏసీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ క్యాండీ, డాక్టర్ సుస్మిత, శామ్యూల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పటమట: ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావని లయన్స్ డిస్ట్రిక్ 316బీ జిల్లా గవర్నర్ లయన్ వీపీపీఎస్ అంజనేయులు పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పటమట త్రివేణి మహిళా డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ వీఆర్‌కేనగర్ స్పార్క్ ఆధ్వర్యంలో సంఘర్షణ నుంచి శక్తి వైపు, యువ మహిళలకు సాధికారిత అనే శీర్షికన ఒక ప్రభావంతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడకు చెందిన కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ లయన్ డాక్టర్ రమేష్ బావిశెట్టి మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు, లక్షణాలు, వాటిని ఎలా అధిగమించాలో తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ సాంబిరెడ్డి, పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ అన్నపురెడ్డి కోటిరెడ్డి, లయన్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్ : ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులపై గురుకుల మహిళా సాధికారత విభాగం, ఇంక్లూజివ్ క్లబ్ సంయుక్తంగా ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యశాలకు గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో యోగా, మనస్తత్వ శిక్షకులు అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ తీవ్ర మనోవేదనలను, ఉద్విగ్నతలనూ ప్రాణయామం ద్వారా ఇతరులతో ఆలోచనలు పంచుకోవడం, హాస్య సినిమాలు చూడటం లాంటి వివిన్న పద్ధతులు పాటించడం ద్వారా ఎదుర్కోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, సత్యవాణి, లావణ్య, డాక్టర్ నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవడాలి

● పటమట సీఐ వి.పవన్‌కిషోర్

పటమట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం నాయకుడికి ప్రధానమని పటమట సీఐ వి.పవన్‌కిషోర్ పేర్కొన్నారు. పటమట శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నాయకులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలరని, అటువంటి నాయకత్వం విద్యార్థి దశలోనే అలవడాలని సూచించారు. గౌరవ అతిథి ఆర్‌ఐ పద్మ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశలోనే నేర్చుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

అనంతరం స్కూల్ హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, మిగిలిన హౌస్ మానిటర్‌కు ఎంపికైన విద్యార్థులకు అతిథుల చేత బ్యాడ్జిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థి నాయకులతో సీఐ పవన్‌కిషోర్



పైథాన్ ప్రోగ్రామ్‌ను వివరిస్తున్న జ్ఞానసాయి ఆదిత్య

పీబీ సిద్ధార్థలో పైథాన్ ప్రోగ్రామ్‌పై శిక్షణ

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కాలేజీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహిస్తోన్న మూడు రోజుల పైథాన్ వర్క్‌షాపును బుధవారం ఎక్సెలర్ ఎడ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ రిసోర్స్ పర్సన్ వి.జ్ఞానసాయి ఆదిత్య ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్, బేసిక్ కోడింగ్‌పై ఆయన విద్యార్థులకు వివరించారు. రెండోరోజు సదస్సు డేటా విశ్లేషణపై జరుగుతుందన్నారు. కాలేజీ డీన్, విభాగాధిపతి ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ, పైథాన్ సాఫ్ట్‌వేర్ కోర్సుకు ఎక్కడ చూసినా డిమాండ్ ఉందని, పైథాన్ ప్రోగ్రాంలో నైపుణ్యం పెంపొందించుకుంటే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.వి.రమేష్ చంద్ర, ప్రొఫెసర్లు కె.విజయ్, శ్రీనివాసులు, కిశోర్, షాలిని పాల్గొన్నారు.



డాక్టర్ దుర్గా దూబేను సత్కరిస్తున్న సిద్ధార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు

ఇంజనీరింగ్ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీకి పునాది వేసుకోవాలి

కానూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు పటిష్ఠమైన సైబర్ సెక్యూరిటీకి పునాది ఏర్పాటు చేసుకోవాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఇన్ఫర్మేషన్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ హెడ్ డాక్టర్ దుర్గా దూబే అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వర్సిటీలో బుధవారం ఎవాల్వింగ్ సైబర్ సెక్యూరిటీ ప్యారడైగమ్స్ ఇండస్ట్రీ ఇన్‌సైట్స్ ఫర్ యాస్పిరింగ్ ఇంజనీర్స్ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో దుర్గా దూబే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, ప్రొ.వీసీ ఏవీ రత్నప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు డి. వెంకటేశ్వరరావు, సునీత, రాజేశ్వరరావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడి అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న సీఐ రమణ

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికుల వస్తువులను చోరీ చేస్తున్న తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు టి.రమేష్ (29)ను బుధవారం అరెస్టు చేసినట్లు విజయవాడ రైల్వేస్టేషన్ సీఐ రమణ తెలిపారు. బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫారంలోని జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌లో నిందితుడి చోరీ వివరాలను మీడియా సమావేశంలో సీఐ వివరించారు. ఆగస్టు 23న తిరుపతి నుంచి వరంగల్‌కు పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం చేసిన బండి రాజ్యలక్ష్మి వద్ద 25 గ్రాముల బంగారు నానుతాడు విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైలు బయలుదేరే సమయంలో చోరీకి గురైంది. బాధితురాలు 25న రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌లతో కలిసి మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు విచారణ చేపట్టారు. పోలీసు అధికారులు సీసీ ఫుటేజీల ద్వారా నిందితుడుని గుర్తించారు. పోలీసులు నిందితుడి కోసం హైదరాబాద్, వరంగల్, ఖమ్మం పట్టణాల్లో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు జైహింద్ కాంప్లెక్స్ వద్ద ఉన్నాడని సమాచారం తెలియటంతో పోలీసులు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు నిందితుడు వద్ద నుంచి రాజ్యలక్ష్మికి చెందిన 25 గ్రాముల బంగారు నానుతాడు, 2024 డిసెంబరులో జరిగిన మరో కేసులో 40 గ్రాముల బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యం

● గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు హేమంత్ కోటేశ్వరరావు



మాట్లాడుతున్న గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సమష్టి కృషి చేస్తున్నట్లు గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు తెలిపారు. గన్నవరం పార్క్ ఎలైట్ హోటల్‌లో బుధవారం గణేష్ ఉత్సవ సమితి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గణేష్ ఉత్సవ సమితి మూడు అంశాలను తీసుకుందని చెప్పారు. ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ పై జిల్లాలో విస్తృత పర్యటన చేసి క్షేత్ర స్థాయిలో ఈ మూడింటి పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. సమితి ఏర్పడిన రోజుల వ్యవధిలోనే రాష్ట్ర అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులను కలిసినట్లు చెప్పారు. అంతరించిపోతున్న హిందూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. తొలుత సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు మాట్లాడారు. కార్యదర్శి మణీంద్రనాథ్, కోనేరు దుర్గా ప్రసాద్, శివాజీ, పొట్లూరి బసవరావు, బి.రవిశంకర్, అశోక్, వెంకటాద్రి రెడ్డి, వీరబాబు, పణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించండి

● జాన్ బెన్నీ లింగం డిమాండ్

ధర్నాచౌక్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు జాన్ బెన్నీలింగం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పాస్టర్లకు 11 నెలల గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని, పంచాయతీ పరిధిలో చర్చిల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఇస్మాయేలు, యోవేలు రాజు, మత్రె రాజ్‌కుమార్, ముద్దు ప్రేమజ్యోతి బాబు, డొక్క జార్జి తదితరులు పాల్గొన్నారు.



ఈ-సేవ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పటమట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ పటమట ఈ-సేవ కేంద్రం ఎదుట జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ విజయవాడ నగర్ కమిటీ ఆధ్వర్యంలో అగర్ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. నగర ప్రధాన కార్యదర్శి వివి రాజు మాట్లాడుతూ ఈ నెల 15న భవన నిర్మాణ కార్మికులు పని బంద్ చేసి రాష్ట్ర లేబర్ ఆఫీస్ ధర్నా ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.వాసు, ఎం. హరికృష్ణ, కిరణ్‌కుమార్, చెన్నకేశవరావు, సైదా, సింహాచలం, తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఎండిపోయిన కొమ్మలు తొలగించండి



మూడవ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మి కాలనీలో ఎండిపోయిన చెట్టు కొమ్మలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గత వారం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్లకు అడ్డువచ్చిన చెట్టు కొమ్మలను తొలగించారు. ప్రస్తుతం కొమ్మలు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -భారతీనగర్, ఆంధ్రజ్యోతి

అమ్మాయిలు..అదే జోరు



సూపర్-4లో కొరియాపై భారత్ గెలుపు

ఆసియా కప్ హాకీ

హంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. టోర్నీలో ఒక్క ఓటమి కూడా కూడా లేకుండా గ్రూప్ దశను టాపర్‌గా ముగించిన మన అమ్మాయిల బృందం.. సూపర్-4లోనూ అంతేదీటుగా విజృంభిస్తోంది. బుధవారం జరిగిన సూపర్-4 తొలి పోరులో భారత్ 4-2తో కొరియాను చిత్తు చేసింది. భారత జట్టులో వైష్ణవి (2వ), సంగీతా కుమారి (33వ), లాల్‌రెమ్సియామి (40వ), రుతుజ (59వ) తలో గోల్ సాధించారు. కొరియా తరఫున యుజిన్ కిమ్ (33వ, 53వ) రెండు గోల్స్ చేసింది. భారత్ తమ రెండో మ్యాచ్‌ను గురువారం చైనాతో ఆడనుంది. నాలుగు జట్లు తలపడే సూపర్-4లో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరతాయి.

అన్‌సీడెడ్ చేతిలో..

- సింధు పరాజయం
- ప్రణయ్, సేన్ ముందంజ
- హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు హాంకాంగ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ భారత స్టార్ అనూహ్యంగా ఆదిలోనే అన్‌సీడెడ్ చేతిలో పరాజయం పాలై నిరాశపరచింది. డెన్మార్క్‌కు చెందిన క్రిస్టోఫర్సెన్ 15-21, 21-16, 21-19తో సింధుకు షాకిచ్చి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 22-20, 16-21, 21-15తో తైపీ ఆటగాడు వాంగ్ జూ వీపై, ప్రణయ్ 21-17, 21-14తో చైనా షట్లర్ లూ గువాంగ జూపై, ఆయుష్ శెట్టి 15-21, 21-19, 21-13తో సూ లి యాంగ్ (తైపీ)పై, కిరణ్ జార్జ్ 21-16, 21-11తో జియా హెంగ్ జాసన్ తె (సింగపూర్)పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్‌లో రీతుపర్ణ పండా/శ్వేతపర్ణ పండా జోడీ 21-17, 21-9తో స్థానిక జంట వానెస్సా పాంగ్/సమ్ యూ వాంగ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. సింగిల్స్‌లో రక్షిత రామరాజు, అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా/ధ్రువ్ కపిల, రుత్విక శివాని/రోహన్ కపూర్ ద్వయం జోడీలు ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

బిష్ణోయ్‌కు 6, అర్ష్‌దీప్‌నకు 10

దుబాయ్: టీమిండియా బౌలర్లు రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో చెరోస్థానం మెరుగుపర్చుకుని ముందంజ వేశారు. వీరు వరుసగా 6, 10వ ర్యాంకుల్లో నిలిచారు. వరుణ్ చక్రవర్తి 4వ ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత్ తరఫున టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ నెంబర్‌వన్ ర్యాంక్‌ను పదిలం చేసుకున్నాడు.

27 బంతుల్లోనే..

భారత్ సునాయాస విజయం

యూఏఈ 57 ఆలౌట్

కుల్దీప్‌కు 4, దూబేకి 3 వికెట్లు



దుబాయ్: డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. ఆసియా కప్‌లో ఘనంగా బోణీ చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కుల్దీప్ యాదవ్ (4/7), శివం దూబే (3/4) తిప్పేయడంతో.. గ్రూప్-ఎలో బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. 79 బంతుల్లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన టీమిండియా.. కేవలం 27 బంతుల్లోనే లక్ష్యాన్ని ఊదేసింది. దీంతో మొత్తం 106 బంతుల్లోనే మ్యాచ్ ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ 13.1 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. అలీషాన్ షరాఫు (22), మహ్మద్ వసీం (19) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. శివం దూబే మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 4.3 ఓవర్లలో 60/1 స్కోరు చేసి గెలిచింది. అభిషేక్ శర్మ (30), శుభ్‌మన్ గిల్ (20 నాటౌట్) రాణించారు. జునైద్ ఒక వికెట్ దక్కించుకొన్నాడు.

అలవోకగా..: స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్లు అభిషేక్, గిల్ ప్రత్యర్థి బౌలింగ్‌ను ఉతికి ఆరేశారు. తొలి బంతినే సిక్స్‌కు తరలించిన శర్మ.. రెండో బంతికి బౌండ్రీ సాధించాడు. రెండో ఓవర్‌లో రోహిద్ బౌలింగ్‌లో గిల్ 4,6తో 15 పరుగులు రాబట్టడంతో స్కోరు బోర్డు దూసుకెళ్లింది. మరో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టిన అభిషేక్‌ను జునైద్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 10 పరుగులు కావల్సి ఉండగా.. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ (7 నాటౌట్) ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. మరోవైపు బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేసిన గిల్.. మరో 93 బంతులు మిగిలుండగానే జట్టుకు ఘన విజయం అందించాడు.

పెవిలియన్‌కు క్యూ..: పవర్‌ప్లేలో పర్వాలేదనిపించినా.. కుల్దీప్ స్పిన్ ఉచ్చులో చిక్కుకొన్న యూఏఈ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈకి ఓపెనర్ అలీషాన్ మెరుగైన ఆరంభాన్నే ఇచ్చాడు. పాండ్యా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదాడు. బుమ్రా బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన షరాఫు.. అక్షర్ వేసిన మూడో ఓవర్‌లో సిక్స్‌తో బ్యాట్ ఝుళిపించాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా యార్కర్‌కు అలీషాన్ పెవిలియన్ చేరాడు. దీంతో తొలి వికెట్‌కు 26 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్ బ్యాటర్ జోహైబ్ (2)ను వరుణ్ క్యాచవుట్ చేశాడు. కానీ, ఆరో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో వసీం మూడు బౌండ్రీలతో 12 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను యూఏఈ 41/2తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో కుల్దీప్ మాయాజాలంతో ఒక్కసారిగా కుదేలైంది. 8వ ఓవర్‌లో రాహుల్ చోప్రా (3), వసీంతోపాటు హర్షిత్ కౌశిక్ (2)ను కుల్దీప్ అవుట్ చేయడంతో.. యూఏఈ 50/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆసిఫ్ ఖాన్ (2), ధ్రువ్ (1), జునైద్ సిద్దిఖీ (0)ను దూబే పెవిలియన్ చేర్చాడు. హైదర్ అలీ (1)ను క్యాచవుట్ చేసిన కుల్దీప్.. యూఏఈ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x హాంకాంగ్

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

స్కోరుబోర్డు

యూఏఈ: అలిషన్ షరాఫు (బి) బుమ్రా 22, మహ్మద్ వసీమ్ (ఎల్బీ) కుల్దీప్ 19, జోహైబ్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 2, రాహుల్ చోప్రా (సి) గిల్ (బి) కుల్దీప్ 3, ఆసిఫ్ (సి) శాంసన్ (బి) దూబే 2, హర్షిత్ (బి) కుల్దీప్ 2, ధ్రువ్ పరాషర్ (ఎల్బీ) దూబే 1, సిమ్రన్‌జీత్ (ఎల్బీ) అక్షర్ 1, హైదర్ (సి) శాంసన్ (బి) కుల్దీప్ 1, సిద్దిఖీ (సి) సూర్య (బి) దూబే 0, మహ్మద్ రోహిద్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.1 ఓవర్లలో 57 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-47, 4-48, 5-50, 6-51, 7-52, 8-54, 9-55, 10-57; **బౌలింగ్:** హార్దిక్ 1-0-10-0, బుమ్రా 3-0-19-1, అక్షర్ 3-0-13-1, వరుణ్ చక్రవర్తి 2-0-4-1, కుల్దీప్ 2.1-0-7-4, శివమ్ దూబే 2-0-4-3.

భారత్: అభిషేక్ (సి) హైదర్ (బి) సిద్దిఖీ 30, గిల్ (నాటౌట్) 20, సూర్యకుమార్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 3, మొత్తం: 4.3 ఓవర్లలో 60/1; వికెట్ పతనం:** 1-48; **బౌలింగ్:** హైదర్ 1-0-10-0, రోహిద్ 1-0-15-0, పరాషర్ 1-0-13-0, సిద్దిఖీ 1-0-16-1, సిమ్రన్‌జీత్ సింగ్ 0.3-0-6-0.

1

4.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. టీ20ల్లో తన వేగవంతమైన ఛేదన నమోదు చేసింది. గతంలో స్కాట్లాండ్‌పై 6.3 ఓవర్లలోనే ఛేదించిన రికార్డును టీమిండియా ఈ మ్యాచ్‌లో తిరగరాసింది.

టైటాన్స్ హ్యాట్రిక్



ముంబాపై గెలుపు ● ప్రో కబడ్డీ


విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్ విశాఖపట్నం అంచెను తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్ విజయంతో ముగించింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 45-37 స్కోరుతో యు ముంబాను చిత్తుచేసింది. టైటాన్స్ రైడర్లు, డిఫెండర్లు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. తొలి భాగంలో టైటాన్స్‌ను ముంబా ఆటగాళ్లు నిలువరించలేకపోయారు. దీంతో ప్రథమార్ధం 27-11తో ముగిసింది. ద్వితీయార్ధంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు అదే జోరు కొనసాగించి మరోసారి యు ముంబాను ఆలౌట్ చేసి సురక్షితమైన ఆధిక్యాన్ని సాధించారు. టైటాన్స్ దాటికి ఒత్తిడికి గురైన ముంబా వరుస లైనౌట్‌లతో పాయింట్లు సమర్పించుకుంది. చివరి నిమిషాలలో అనూహ్యంగా పుంజుకున్న ముంబా ఆటగాళ్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేసినా ఫలితం లేకపోయింది. టైటాన్స్‌లో రైడర్ భరత్ 13 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించగా, యు ముంబాలో సందీప్‌కుమార్, అమి మహ్మద్ జఫర్ దనేష్ చెరో ఏడు పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 43-32తో యూపీ యోధాస్‌ను ఓడించింది.

నిఖత్‌కు నిరాశ

క్వార్టర్స్‌లో ఓటమి

- సెమీఫైనల్‌కు నూపుర్, జాస్మిన్
- భారత్‌కు రెండు పతకాలు ఖరారు
- ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్





లివర్‌పూల్ (ఇంగ్లండ్): తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో టైటిల్ మిస్సయింది. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ పోరాటం ఈసారి క్వార్టర్‌ఫైనల్‌కే పరిమితమైంది. గతసారి (2023) 50 కిలోలు, అంతకుముందు (2022) 52 కిలోల విభాగాలలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి 51 కిలోల బరిలో దిగింది. అయితే బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జరీన్ 0-5తో రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో చిత్తయింది. దాంతో టోర్నీ నుంచి నిఖత్ రిక్తహస్తాలతో వెనుదిరిగింది. అయితే, నిఖత్ నిరాశపరిచినా.. హరియాణా బాక్సర్లు నూపుర్ షెరాన్, జాస్మిన్ లంబోరియా తమ విభాగాల్లో సత్తా చాటి భారత్‌కు రెండు పతకాలు ఖాయం చేశారు. మహిళల 80+ కేజీల విభాగంలో నూపుర్, 57 కిలోల కేటగిరిలో జాస్మిన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దిగ్గజ బాక్సర్ హవా సింగ్ మనుమరాలైన 26 ఏళ్ల నూపుర్ క్వార్టర్‌ఫైనల్లో 4-1తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒల్టినోయ్ సోతింబోవను చిత్తు చేసింది. మరో క్వార్టర్స్ బౌట్‌లో జాస్మిన్ 5-0తో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ ఖుమోరాబోను మమజొనొవాపై గెలిచింది. సెమీఫైనల్స్‌లో ఓడినా వీళ్లకు కాంస్య పతకాలు దక్కుతాయి. ఇక..పురుషుల కేటగిరీలో జాదుమని సింగ్ (48 కి), అబినాష్ జమ్వాల్ (65 కి) క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టి పతకానికి ఒక్క విజయం దూరంలో నిలిచారు. కాగా, మరో భారత బాక్సర్ జుగ్నూ అహ్లావత్ (85 కి) తొలి రౌండ్ పరాజయంతో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.

భారత్-పాక్ మ్యాచ్‌కు తగ్గిన డిమాండ్!

పూర్తిగా అమ్ముడుపోని టికెట్లు

దుబాయ్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అంటే టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ రెండు జట్లు తొలిసారిగా తలపడనుండడంతో.. డిమాండ్ భారీగా ఉంటుందని అంచనా వేశారు. కానీ, ఆసియాకప్‌లో ఆదివారం జరిగే ఇండో-పాక్ మ్యాచ్ టికెట్లు ఇంకా అందుబాటులో ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. హైవోల్టేజ్ మ్యాచ్‌కు డిమాండ్ తగ్గడానికి అధిక ధరలే కారణమని తెలుస్తోంది. రెండు సీట్లకు రూ. 10,000 అన్నింటికంటే తక్కువ. వీఐపీ రాయల్ బాక్స్‌లో జతకు రూ. 2,30,700, స్కైబాక్స్ టికెట్ రూ. 1,67,851గా నిర్ణయించారు. ప్లాటినం రూ. 75,658, గ్రాండ్ లాంజ్ రూ. 41,153 లాంటి మధ్య శ్రేణి టికెట్లు కూడా సగటు ప్రేక్షకుడికి అందుబాటులో లేవు.

తుపాకీ గురిపెట్టి..క్రికెటర్ల దోపిడీ

బార్బడోస్‌లో ఘటన

బార్బడోస్: కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో సెయింట్ కిట్స్, నెవిస్ పాట్రియాట్స్ జట్టు ఆటగాళ్లు దోపిడీకి గురయ్యారు. ఆ క్రికెటర్లు, సీపీఎల్ అధికారి ఒకరు ఓ ప్రయివేట్ ఈవెంట్‌ను ముగించుకొని మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హోటల్‌కు వెళుతూ మార్గమధ్యంలో ఆహారంకోసం ఒకచోట ఆగారు. ఆ సమయంలో కొందరు దొంగలు.. క్రికెటర్లు, ఆ అధికారిని తుపాకీతో బెదిరించి నగలు, ఇతర విలువైన వస్తువులు దోచుకొన్నారు. ఈక్రమంలో క్రికెటర్లు దొంగలను ప్రతిఘటించగా వారి మధ్య పెనుగులాట జరిగింది. పెనుగులాటలో దొంగలు ఓ తుపాకీని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ ఘటనలో క్రికెటర్లు సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలి నుంచి పోలీసులు ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

బిజినెస్

మస్క్‌ను వెనక్కి నెట్టిన ల్యారీ ఎల్లిసన్

ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానానికి



న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్ సహ-వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ ప్రపంచ ధనవంతుల జాబితాలో టెస్లా సారథి ఎలాన్ మస్క్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి ఎగబాకారు. ఫోర్బ్స్ రియల్ టైం బిలియనీర్స్ లిస్ట్ ప్రకారం, 81 ఏళ్ల ఎల్లిసన్ వ్యక్తిగత సంపద బుధవారం ఏకంగా 10,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.8.89 లక్షల కోట్లు) పెరిగి మొత్తం రూ.39,570 కోట్ల డాలర్లకు (రూ.34.82 లక్షల కోట్లు) చేరుకుంది. ఒరాకిల్ షేరు ఒక్కరోజే ఏకంగా 41 శాతం పెరగడం ఇందుకు దోహదపడింది. 1992 తర్వాత ఒక్క రోజులో కంపెనీ షేరు ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. దాంతో ఒరాకిల్ మార్కెట్ విలువ 29,900 కోట్ల డాలర్ల మేర పెరిగి లక్ష కోట్ల డాలర్లకు చేరువైంది. ప్రస్తుతం సంస్థలో ఎల్లిసన్ 41 శాతం వాటా కలిగి ఉన్నారు. ఒరాకిల్ త్రైమాసిక పనితీరు మార్కెట్ అంచనాలను మించడంతోపాటు క్లౌడ్ వ్యాపారం భవిష్యత్‌పై అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం కంపెనీ షేర్లు భారీగా ర్యాలీ తీశాయి. కాగా, ప్రపంచ కుబేరుల జాబితాలో 300 రోజులుగా అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చిన మస్క్.. రెండో స్థానానికి జారుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 38,500 కోట్ల డాలర్లకు (రూ.33.88 లక్షల కోట్లు) పరిమితమైంది.


మూడో రోజూ లాభాల్లో సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో అప్‌ట్రెండ్ బుధవారం నాడు కూడా కొనసాగింది. సెన్సెక్స్ 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద ముగియగా నిఫ్టీ 104.5 పాయింట్ల లాభంతో 24,973.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ లాభాలతో ముగియడం వరుసగా ఇది మూడో రోజు కాగా నిఫ్టీకి ఆరో రోజు. భారత-అమెరికా వాణిజ్య చర్చలు త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే రావచ్చునన్న ఆశలు, జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ భాగంలో కంపెనీల ఆదాయాలు బాగా పుంజుకుంటాయన్నఅంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు కూడా ఇందుకు తోడయ్యాయి.

- బుధవారం ప్రారంభమైన అర్బన్ కంపెనీ ఐపీఓకు మదుపరులు బ్రహ్మరథం పట్టారు. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొద్ది సేపటికే ఇష్యూ మొత్తం సబ్‌స్క్రైబ్ అయింది. తొలి రోజు ముగిసే సరికి 3.13 రెట్లు సబ్‌స్క్రైబ్ అయినట్టు సమాచారం.

ఎంఎఫ్ లావాదేవీల్లో ఎన్ఎస్ఈ రికార్డు: మ్యూచువల్ ఫండ్ లావాదేవీల్లో 'ఎన్ఎస్ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫాం' రికార్డు సృష్టించింది. బుధవారం ఈ వేదికపై రికార్డు స్థాయిలో 15 లక్షలకుపైగా లావాదేవీలు నమోదైనట్టు ఎన్ఎస్ఈ తెలిపింది. సభ్యులు, డిస్ట్రిబ్యూటర్ల నమ్మకం, మద్దతుతోనే ఇది సాధ్యమైందని ఎన్ఎస్ఈ పేర్కొంది.

కృత్రిమ మేధతో ప్రపంచ జీడీపీకి అదనంగా రూ.1,382 లక్షల కోట్లు




న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) 21వ శతాబ్దిని నిర్వచించే టెక్నాలజీగా మారిందని, 2030 నాటికి ప్రపంచ జీడీపీకి ఇది 1570 కోట్ల డాలర్లు (రూ.1,382 లక్షల కోట్లు) జోడిస్తుందని ఫిక్కీ-బీసీజీ రూపొందించిన ఒక శ్వేతపత్రంలో అంచనా వేశాయి. అయితే ఏఐని అనుసరించే విషయంలో మాత్రం భారీ వ్యత్యాసాలున్నట్టు ఆ పత్రంలో తెలిపాయి. ప్రపంచ సమ్మిళిత వృద్ధికి ఏఐని ఒక సాధనంగా చేసుకోవాలని పిలుపు ఇచ్చాయి. ఏఐని అందరికీ అందుబాటులోకి తేవడానికి పరిశోధన, పెట్టుబడులు, నైపుణ్యాల కల్పన, నైతిక (రైజ్) నియమావళి అనుసరించాలని సూచించాయి. అందులోని ప్రధానాంశాలు..

- ఈ రంగంలో పరిశోధనలు, ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి.
- ఏఐని అందరికీ ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాలకు అందుబాటులోకి తేవడం లక్ష్యంగా పెట్టుబడులు, మౌలిక వసతులు విస్తరించాలి.
- ఏఐ ప్రతిభలో వ్యత్యాసాలు తొలగించేందుకు సిబ్బందిలో నైపుణ్యాలకు మెరుగులు దిద్దడంతో పాటు ఏఐ పరిజ్ఞానాన్ని అందరూ భారీ ఎత్తున పంచుకునే వాతావరణం సృష్టించాలి.
- ఏఐ వ్యవస్థలు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా ఉండేలా చూసేందుకు శక్తివంతమైన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

23 నుంచి గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

అమెజాన్ ఇండియా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025 ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రైబర్లు ఒక రోజు ముందే ఇందులో పాల్గొనవచ్చు. ఈ ఫెస్టివల్‌లో 17 లక్షల మందికి పైగా అమ్మకందారులు తమ ఉత్పత్తులను అమ్మకానికి పెడుతున్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అమ్మకందారులే 80,000 వరకు ఉంటారని అమెజాన్ ఇండియా డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్) తేట కిషోర్ చెప్పారు. రెండు రాష్ట్రాల్లోని 700కుపైగా డెలివరీ కేంద్రాల ద్వారా ఈ సారి తమ కస్టమర్లకు సరుకులు అందించనున్నట్టు తెలిపారు. జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఏడాది 'అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025' అమ్మకాలు భారీగా పుంజుకుంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ ఫెస్టివల్ అమ్మకాల రద్దీకి అనుగుణంగా సరుకులను కొనుగోలుదారులకు అందించేందుకు లక్షన్నర మంది సీజనల్ ఉద్యోగులను అమెజాన్ ఇండియా నియమించింది. తెలంగాణ సహా దేశంలోని ప్రధాన నగరాల్లో కొనుగోలు దారులు ఎక్కువగా మిడ్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు, టీవీల వంటి కన్జూమర్ ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆసక్తి చూపిస్తున్నట్టు అమెజాన్ ఇండియా డైరెక్టర్ (కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్) జెబా ఖాన్ చెప్పారు.

ఈ ఏడాది వృద్ధి 6.9 శాతం

అంచనాలను పెంచిన ఫిచ్.. దేశీయ డిమాండ్ వృద్ధికి చోదకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరపతి రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో బలమైన వృద్ధి నమోదవడంతో పాటు దేశీయంగా వినియోగం భారీగా పుంజుకోనుండటం ఇందుకు కారణంగా పేర్కొంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ట్రంప్ సుంకాల నేపథ్యంలో పలు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు, బహుళజాతి ఆర్థిక సంస్థలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ వచ్చాయి. ఇలాంటి ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలోనూ వృద్ధి అంచనాలను పెంచిన తొలి అంతర్జాతీయ ఏజెన్సీ ఫిచ్. పైగా అన్ని ఏజెన్సీల్లోకెల్లా అత్యధిక వృద్ధిని అంచనా వేసింది కూడా ఇదే. దేశీయంగా వినియోగం భారీగా పెరగడంతో పాటు ట్రంప్ సుంకాల ప్రభావం నుంచి బయటపడేందుకు జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దోహదపడగలదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెలకుగాను ఫిచ్ విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్ ఔట్‌లుక్ నివేదికలోని మరిన్ని విషయాలు..

- ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 6.7 శాతం వృద్ధిని అంచనా వేయగా.. 7.8 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచుతున్నట్టు తెలిపింది.
- గడిచిన కొన్ని నెలల్లో అమెరికా-భారత్ మధ్య వాణిజ్య అనిశ్చితి పెరిగింది. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఆగస్టు 27 నుంచి 50 శాతానికి పెంచారు. భవిష్యత్‌లో ఈ సుంకం మళ్లీ దిగిరావచ్చని భావిస్తున్నాం. కానీ, అమెరికాతో వాణిజ్య సంబంధాలపై నెలకొన్న అనిశ్చితి వ్యాపార సెంటిమెంట్, పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపనుంది.
- ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్న జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగం పెరిగేందుకు దోహదపడనుంది. దేశీయ డిమాండే వృద్ధికి ప్రధాన చోదకం. బలమైన గృహ ఆదాయం వినియోగానికి, సులభమైన ఆర్థిక పరిస్థితులు పెట్టుబడులకు ఊతమివ్వనున్నాయి.
- ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో మాత్రం వృద్ధి కాస్త నెమ్మదించవచ్చు. 2026-27లో వృద్ధిరేటు 6.3 శాతంగా, 2027-28 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- ఈ సారి మెరుగైన వర్షపాతం నమోదవడంతో పాటు అధిక స్థాయిలో ఆహార నిల్వలున్న నేపథ్యంలో ధరల సూచీ అదుపులోనే ఉండనుంది. ఈ ఏడాది చివరినాటికి వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3.2 శాతంగా, 2026 చివరినాటికి 4.1 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- ఈ ఏడాది చివర్లో ఆర్‌బీఐ రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించవచ్చు. వచ్చే ఏడాదిలో మాత్రం రెపో యథాతథంగా కొనసాగవచ్చు. ఆర్‌బీఐ 2027లో రెపోరేటును మళ్లీ పెంచేందుకు అవకాశాలున్నాయి.

రాజమండ్రిలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

100 పడకల సామర్థ్యంతో ఏర్పాటు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సేవలను మరింత విస్తరించింది. తాజాగా రాజమండ్రిలో 100 బెడ్ల సామర్థ్యంతో కూడిన ఆస్పత్రిని బుధవారం ప్రారంభించింది. ఏపీలో రెయిన్‌బోకు ఇది మూడో హాస్పిటల్. విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అంతేకాదు, ఈ ఆర్థిక సంవత్సరంలో వరంగల్, గువాహటి తర్వాత రెయిన్‌బో ప్రారంభించిన మూడో హాస్పిటల్ కూడా ఇదే. ఈ విస్తరణతో కలిపి రెయిన్‌బో మొత్తం 9 నగరాల్లో 2,300 పడకల సామర్థ్యంతో కూడిన 22 హాస్పిటళ్లు, 5 క్లినిక్‌లను నిర్వహిస్తోంది.

ఎస్ట్రీ ఇండియాతో ధ్రువ స్పేస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ ఎస్రీ ఇండియాతో హైదరాబాద్ స్టార్టప్ ధ్రువ స్పేస్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ధ్రువ స్పేస్ తన అస్త్రావ్య శాటిలైట్ ఇమేజరీ సర్వీస్‌ను ఎస్రీ ఇండియాకు చెందిన ఆర్క్‌జీఐఎస్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించనుంది. తద్వారా 200కు పైగా ఉపగ్రహాల నుంచి భూమి పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు మరింత సులభంగా పొందేందుకు వీలుపడనుంది.

రూ.35 తగ్గనున్న సిమెంట్ ధర

ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలతో సిమెంట్ ధరలు దిగి రానున్నాయి. ఈ తగ్గింపు 50 కిలోల బస్తాపై రూ.30 నుంచి రూ.35 వరకు ఉంటుందని ఇండియా రేటింగ్స్ అంచనా. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర కంపెనీని బట్టి రూ.330 నుంచి రూ.370 వరకు పలుకుతోంది. జీఎస్‌టీ ప్రయోజనాలను ఈ నెల 23 నుంచి వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలు భావిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే రిటైల్ మార్కెట్‌లోనూ బస్తా సిమెంట్ ధర రూ.30 నుంచి రూ.35 వరకు తగ్గుతుందని అంచనా.

ఎస్ఎస్ఎల్‌వీ తయారీ కోసం 3 కంపెనీలతో హెచ్ఏఎల్ ఒప్పందం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): 500 కిలోల కన్నా తక్కువ బరువు గల ఉపగ్రహాల ప్రయోగానికి స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ) తయారీ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) మధ్య సాంకేతిక బదిలీ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా హెచ్ఏఎల్ ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్లను సొంతంగా అభివృద్ధి చేయడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా స్వీకరిస్తుంది. ఇందుకోసం వచ్చే రెండేళ్లపాటు హెచ్ఏఎల్‌కు ఇస్రో అవసరమైన శిక్షణ ఇవ్వడంతోపాటు రాకెట్ల అభివృద్ధికి సాంకేతిక మద్దతునివ్వనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	137
వరంగల్	118	గుంటూరు	127
కరీంనగర్	118	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	111
కర్నూలు	118	నెల్లూరు	116
విశాఖపట్నం	141	అనంతపురం	116
గోదావరి	137		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,510 ▲	1,01,300 ▲	1,40,000 ▲
విజయవాడ	1,13,000 ▲	1,07,000 ▲	1,28,270 ▲
విశాఖపట్నం	1,12,990 ▲	1,01,300 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,510 ▲	1,01,300 ▲	1,27,900 ▼
ప్రొద్దుటూరు	1,13,700 ▲	1,04,600 ▲	1,28,000 ▼
ముంబై	1,09,640 ▲	1,00,430 ▲	1,24,590 ▼

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266
నెక్ కోడిగుడ్ల ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545	



దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే సుజనాకు ఆహ్వానం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 22 నుంచి జరగనున్న దేవీ నవరాత్రి (దసరా) ఉత్సవాలకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరికి ఆలయ ఈవో శీనానాయక్ అర్చకులతో కలిసి బుధవారం తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందించారు. ఎమ్మెల్యే సుజనాను వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల ఏర్పాట్లు, అభివృద్ధి పనులను ఎమ్మెల్యే తెలుసుకున్నారు.



ఎమ్మెల్యే సుజనా చౌదరికి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో శీనానాయక్



గణేశుడికి పూజలు చేస్తున్న అర్చక స్వాములు

దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థి తిథి సందర్భంగా బుధవారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. గణపతికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వేదోక్తంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి తరువాత వచ్చే చవితి తిథినాడు సంకష్టహర గణపతిని ఆరాధించడం జరుగుతున్నది. పలువురు భక్తులు పాల్గొని గణేశుడికి పూజలు చేశారు.

దసరా ఉత్సవాలు 22 నుంచి

చిట్టినగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయదుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 22నుంచి అక్టోబరు 2 వరకు దసరా నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, చింతలపాటి నాగ వెంకట పవన్ కుమార్ శర్మలు పేర్కొన్నారు. బుధవారం మిల్క్‌ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న విజయ దుర్గా రామలింగేశ్వర పంచ ముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 2న ఉదయం గణపతి పూజతో ప్రారంభమై కలిసి స్థాపన కుంకుమ పూజా కార్యక్రమం జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు ప్రథమ పూజ 9.30 గంటలకు రెండో సారి కుంకుమ పూజ జరుగుతుందన్నారు. అనంతరం చండీ హోమం పూర్ణాహుతి రాత్రి 8గంటలకు సెమీ పూజ జరుగుతుందన్నారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఆలయ అధ్యక్షుడు వెన్నం రజని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి దేవాలయంలో....

సత్యనారాయణపురం: ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకూ శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ రాజు, దాట్ల శివరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న గోపూజతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. ప్రతీ రోజు అమ్మవారికి కుంకుమార్చనలు, చండీ హోమం, ఖడ్గమాల, లలితా సహస్రనామపారాయణం జరుగుతాయని తెలిపారు.



దసరా ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

చిట్టినగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లపాలెం గట్టులోని ఓ బిల్డింగ్ పెంట్ హౌస్‌లో అనుమానాస్పదంగా రాజగిరి దేవానంద్ అలియాస్ మురళి (50) బుధవారం చనిపోయి ఉన్నాడు. దేవానంద్‌కు భార్య కుమారుడు ఉన్నారు. ఏడేళ్ల క్రితం దంపతులు విడాకులు తీసుకున్నారు. దేవానంద్ పొట్టిశ్రీరాములు వీధిలోనే ఓ బిల్డింగ్ పెంట్‌హౌస్‌లో ఉంటున్నాడు. ఇతను మార్బుల్ పనులు చేస్తూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం దేవానంద్ ఉంటున్న పెంట్‌హౌస్ నుంచి దుర్వాసన రావటంతో స్థానికులు దేవానంద్ బంధువు పిల్లా శ్రీనివాసరావుకు తెలియపరిచారు. ఆయన పొట్నూరి సురేష్‌ను చూసి రమ్మని పంపాడు. సురేష్ వెళ్లి చూడగా దేవానంద్ చనిపోయి ఉన్నాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బంధువు ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికుల వస్తువులను చోరీ చేస్తున్న తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్‌కు చెందిన పాత నేరస్థుడు టి.రమేష్ (29)ను బుధవారం అరెస్టు చేసినట్టు విజయవాడ రైల్వేస్టేషన్ సీఐ రమణ తెలిపారు. బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫారంలోని జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో నిందితుడి చోరీ వివరాలను మీడియా సమావేశంలో సీఐ వివరించారు. ఆగస్టు 23న తిరుపతి నుంచి వరంగల్‌కు పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం చేసిన బండి రాజ్యలక్ష్మి వద్ద 25 గ్రాముల బంగారు నానుతాడు విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైలు బయలుదేరే సమయంలో చోరీకి గురైంది. బాధితురాలు 25న రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్‌లతో కలిసి మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు విచారణ చేపట్టారు. పోలీసు అధికారులు సీసీ ఫుటేజీల ద్వారా నిందితుడుని గుర్తించారు. పోలీసులు నిందితుడి కోసం హైదరాబాద్, వరంగల్, ఖమ్మం పట్టణాల్లో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు జైహింద్ కాంప్లెక్స్ వద్ద ఉన్నాడని సమాచారం తెలియటంతో పోలీసులు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు నిందితుడు వద్ద నుంచి రాజ్యలక్ష్మికి చెందిన 25 గ్రాముల బంగారు నానుతాడు, 2024 డిసెంబరులో జరిగిన మరో కేసులో 40 గ్రాముల బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

బైక్‌ల చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

● రూ.4.5లక్షల విలువైన 7 మోటార్ సైకిళ్లు స్వాధీనం

వన్‌టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో మోటార్ సైకిళ్లు దొంగిలిస్తున్న గుంటూరు జిల్లా కొల్లిపర మండలం దావులూరిపాలెంకు చెందిన తోట వెంకటేష్ (32)ను బుధవారం అరెస్టు చేసినట్టు సూర్యారావుపేట సీఐ షేక్ ఎండీ అలీ తెలిపారు. సూర్యారావుపేట, గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ల పరిధిలో ఇటీవల నివాసాల ముందు, రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన 7 మోటారు సైకిళ్లు చోరీ అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా పోలీసు స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. సూర్యారావుపేట సీఐ షేక్ ఎండీ అలీ తమ సిబ్బందితో మంగళవారం సాయంత్రం అరండల్‌పేట సంజీవయ్య కాలనీ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోట వెంకటేష్ పోలీసులను చూసి పారిపోతుండగా అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. వెంకటేష్ గవర్నర్‌పేట, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 7 మోటార్ సైకిళ్లు చోరీ చేసినట్టు విచారణలో తెలిసింది. పోలీసులు వెంకటేష్ దొంగిలించిన సుమారు రూ.4.5లక్షల విలువైన 7 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తెలుగు యువత నాయకుడు రవీంద్ర

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

వన్‌టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటో రిక్షా కార్మికులకు దసరా కానుకగా రూ.15వేలు ప్రకటించటం పై బుధవారం వన్‌టౌన్ మల్లికార్జునపేటలోని పశ్చిమ టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకుడు కాండ్రేగుల రవీంద్ర అధ్యక్షతన చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాండ్రేగుల రవీంద్ర మాట్లాడుతూ దసరా పండుగ ముందుగానే ఆటో కార్మికులందరికీ రూ.15వేలు దసరా కానుకగా ప్రకటించటం ఆనందంగా ఉందన్నారు. ఆటో కార్మికులు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన వితరణ నూతన భవనం ప్రారంభం

విద్యాధరపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుమ్మరిపాలెం సెంటర్‌లో నూతనంగా నిర్మించిన నిత్య అన్నప్రసాద వితరణ నూతన భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నార్తులకు అండగా నిలుస్తున్న లయన్స్ క్లబ్, ట్రస్ట్ ఛైర్మన్ లయన్ దేవినేని జోని కుమారి సేవలను కొనియాడారు. ఎంతో మంది కడుపునింపుతున్న లయన్స్ డిస్ట్రిక్ట్ 316 డి విజయీభవ సర్వీస్ ట్రస్ట్ వారికి తమ సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే సుజనా తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు దేవినేని జోని కుమారి, గార్లపాటి విద్యావతి, ప్రెసిడెంట్ ముల్పూరి ఉపేంద్ర, వక్కలగడ్డ భాస్కరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, కూటమి నేతలు పాల్గొన్నారు.



నిత్య అన్న ప్రసాద వితరణ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

మా సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే సుజనా చౌదరికి 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శివశర్మ వినతి

విద్యాధరపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిని 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కె.శివశర్మ కోరారు. బుధవారం కుమ్మరిపాలెం సెంటర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను కె.శివశర్మ కలిసి 39వ డివిజన్‌లో ప్రజల సమస్యలను వివరించారు. పలు వీధులు కొద్ది పాటి వర్షానికే జలమయమై ఇళ్లలోకి వర్షపునీరు వెళ్లి నిలిచిపోతుందని, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాలువల ఎత్తు పెంచి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విభాగం అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతానని ఎమ్మెల్యే శివశర్మకు హామీ ఇచ్చారు.

సితార సర్కిల్‌లో వాటర్ ఫౌంటేన్‌కు శంకుస్థాపన

విద్యాధరపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సితార సర్కిల్‌లో సుమారు రూ.40లక్షలతో నిర్మాణం చేయనున్న వాటర్ ఫౌంటెన్, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి బుధవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, టీడీపీ సీనియర్ నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించండి

● జాన్ బెన్నీ లింగం



ధర్నాలో పాల్గొన్న క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు

ధర్నాచౌక్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు జాన్ బెన్నీలింగం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పాస్టర్లకు 11 నెలల గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని, పంచాయతీ పరిధిలో చర్చిల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఇస్సాయేలు, యోవేలు రాజు, మత్తే రాజ్‌కుమార్, ముద్దు ప్రేమజ్యోతి బాబు, డొక్క జార్జి తదితరులు పాల్గొన్నారు.



దోమతెరలతో నిరసన తెలుపుతున్న ఐద్వా సభ్యులు

దోమతెరలతో నిరసన

అజిత్‌సింగ్‌నగర్ : నగరంలో దోమల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఐద్వా సిటీ కార్యదర్శి జి. ఝాన్సీరాణి కోరారు. దోమల నివారణకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ 58వ డివిజన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో దోమతెరలతో బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో దోమల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐద్వా సభ్యులు కె. శ్రీదేవి, మణి, కాశింబీ, సుజిత పాల్గొన్నారు.

వ్యాన్‌లోని నగదు దొంగిలించిన నలుగురిపై కేసు

చిట్టినగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాముల కాలువ సమీపంలో వెస్ట్ బైపాస్ రోడ్డు మధ్యలో నిలిపిన కోళ్ల లోడు వ్యాన్‌లో భద్రపరచిన రూ.40వేలు దొంగిలించిన నలుగురిపై బుధవారం కొత్తపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. న్యూఆర్ ఆర్‌పేటలోని త్రివేణి చికెన్ షాపు ఓనర్ హరిప్రకాష్ కోళ్లవ్యాన్‌కు గోపీ డ్రైవర్‌గా, అసిస్టెంట్‌గా రొట్టచందు పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి వీరిద్దరూ ఓనర్ వద్ద జీతం రూ.42వేలు తీసుకున్నారు. అక్కడి నుంచి ఇద్దరు వ్యాన్‌లో ఏలూరు సమీపంలో ఉన్న కూచింపూడి వెళ్లి అక్కడ 700 కోళ్లు వ్యానులో లోడు చేసుకుని విజయవాడ బయలుదేరారు. పాముల కాలువ వద్దకు వచ్చేసరికి ఇద్దరూ వెస్ట్ బైపాస్ రోడ్డు మధ్యలో వ్యాన్ పార్కింగ్ చేసి కొద్ది దూరంలో కాలకృత్యాలు తీర్చుకుంటుండగా నలుగురు వ్యక్తులు బైక్‌పై వచ్చి వ్యాన్ డ్యాష్‌బోర్డులో భద్రపరచిన రూ.40వేలు తీసుకుని పరారయ్యారు. బాధితులు ఫోన్ ద్వారా హరిప్రకాష్‌కు విషయాన్ని తెలియపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు డబ్బులు దొంగిలించిన నలుగురి పై కేసు నమోదు చేశారు.

44వ డివిజన్‌లో రూ.17లక్షలతో అభివృద్ధి పనులు

విద్యాధరపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక 44వ డివిజన్‌లో రూ.17 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం ఆ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ 44వ డివిజన్ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా తాము పనిచేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ నాయకులు మొలవరపు దుర్గారావు, పెద్దలు వీరంకి సత్యనారాయణ, ఏలు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



విద్యాధరపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ మతిస్థిమితం లేని సితార సెంటర్‌కు చెందిన వెన్న శివారెడ్డి (50) అదృశ్యమైనట్టు బుధవారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శివారెడ్డి భార్య, కుమారుడు, కుమార్తెతో ఉంటున్నాడు. అతను కొంతకాలం నుంచి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ మతిస్థిమితం లేకపోవటంతో ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈనెల 2న ఉదయం భార్య డ్యూటీకి వెళ్లగా కుమారుడు, కుమార్తెలు కాలేజీకి వెళ్లారు. పిల్లలు ఇంటికి వచ్చి చూడగా తండ్రి కనిపించకపోవటంతో డ్యూటీలో ఉన్న తల్లికి ఫోన్ చేసి చెప్పారు. ఆమె ఇంటికి వెళ్లి చుట్టుప్రక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ శివారెడ్డి ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విశ్వనాథ సత్యనారాయణ రచనలు యువతరం చదవాలి

● పాలపర్తి శ్యామలానంద ప్రసాద్



కవిసామ్రాట్ విశ్వనాథకి నివాళి అర్పిస్తున్న పాలపర్తి భాస్కర శర్మ తదితరులు

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, వైదిక సంప్రదాయాలను తన రచనల్లో పొందుపరిచిన విశ్వనాథ సత్యనారాయణ రచనలను నేటి యువతరం చదవాలని అచ్చతెలుగు అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అన్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 130వ జయంతి సందర్భంగా లెనిన్ సెంటర్ విశ్వనాథ సత్యనారాయణ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి బుధవారం సంస్కారభారతి సభ్యులు నివాళులర్పించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ విశ్వనాథ జయంతిని సాహిత్య దినోత్సవంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ యువత విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. నగర అధ్యక్షులు పీవీబీ భాస్కరశర్మ, ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయరాజు ప్రసంగించారు. పలువురు సాహితీవేత్తలు విశ్వనాథ పద్యాలను ఆలపించారు. సమావేశంలో సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి జి.రాంకుమార్, జిల్లా అధ్యక్షురాలు సుహాసిని, రూపశ్రీ, దూండీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్: గాంధీనగర్‌లోని కార్యాలయంలో సత్యనారాయణ జయంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ఆంధ్రలో సంప్రదాయ సాహిత్యానికి విశ్వనాథ సత్యనారాయణ పెద్దదిక్కుగా నిలిచారని తెలిపారు. అనంతరం బీసెంట్ రోడ్డులోని విశ్వనాథ విగ్రహానికి పూలమాల వేశారు. స్వీట్స్, మజ్జిగ పంపిణీ చేశారు. సంస్థ కన్వీనర్ ఎంవి.చలమయ్య, వాయిద్య కళాకారుడు యలమందరావు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో హజరత్తయ్య గుప్తాను ఘనంగా సత్కరించారు.



సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గుప్తా



విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గవర్నర్‌పేట: మొట్టమొదటి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని బుధవారం లెనిన్ సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ సంఘాల నేతలు శార్వాణి మూర్తి, చల్లా సుధాకర్, దమ్మాల చంద్రశేఖర్, పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.545	

కనుమూరులో దొంగ హల్‌చల్

కనుమూరు(గంపలగూడెం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఒక దొంగ బరితెగించి కనుమూరు గ్రామంలో బుధవారం, ఒక మహిళను తన మాటలతో మాయచేసి చెవులకు ఉన్న బంగారు జోడు లాక్కొని పారిపోవడానికి ప్రయత్నించాడు. గ్రామంకు చెందిన కొందరు దొంగను వెంబడించి పట్టుకోగా బంగారాన్ని నోటిలో వేసుకొని కొరికి పాడుచేశాడు. గ్రామస్తులు ఎందుకు ఇలా చేశావని ప్రశ్నించగా, నాకు మతిస్థిమితం సరిగా లేదని చెప్పుకున్నాడు. గ్రామస్తులు దొంగను పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు నిర్వహిస్తున్నారు.



అవంతపురం సూపర్ సిక్స్ సభలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, తదితరులు.

'సూపర్ సిక్స్' సభకు తరలిన నేతలు

గొల్లపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి, రాయనపాడు, షైదూరుపాడు, జక్కంపూడి, తదితర ప్రాంతాల నుంచి బుధవారం అనంతరపురంలో జరిగిన సూపర్ సిక్స్ సభకు పెద్ద ఎత్తున నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ సభకు విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల నుండి నేతలు కార్యకర్తలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో రాష్ట్రంలోని ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. విజయవాడ ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, నేతలు కాటమనేని పూర్ణచంద్రరావు, బొర్రా తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

ఫార్మేషన్ డే అవార్డుల్లో ఎల్‌బీఆర్సీఈ అధ్యాపకుల ప్రతిభ



బెస్ట్ అవార్డు అందుకుంటున్న ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, ఫార్మేషన్ డే సందర్భంగా జేఎన్‌టీయూకే నిర్వహించిన నేషనల్ టీచర్స్ డే అవార్డులు 2025లో లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాల అధ్యాపకులకు వి-2 విభాగాల్లో కళాశాలకు బెస్ట్ కళాశాల జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి.వీరయ్య, ప్రొఫెసర్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఉత్తమ ఉపాధ్యాయునిగా బోధనలో అత్యుత్తమ ప్రతిభ అవార్డులు అందుకున్నారన్నారు. వి.ధనరాజ్, మెకానికల్ ఇంజనీరింగ్ అవార్డును ఇవ్వటం జరిగిందన్నారు.



సచివాలయ సిబ్బందికి వస్తువులు అందజేస్తున్న టీడీపీ నాయకుడు కొండపల్లి దుర్గారావు

ప్రైమరీ హెల్త్ సెంటర్ కార్యాలయంలో ఫ్యాన్లు అందజేత

గొల్లపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడిలో స్థానిక కోయపేటలోని పీహెచ్‌సీ కార్యాలయంలో బుధవారం ఫ్యాన్లు అందజేసినట్టు టీడీపీ నాయకుడు కొండపల్లి దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యాలయంలోని సిబ్బందికి ఉపయోగపడే విధంగా పలు వస్తువులు అందజేసినట్టు తెలిపారు. దసరా పండుగ సందర్భంగా అమ్మవారి విగ్రహం ఏర్పాటుచేసి దేవీ నవరాత్రి మహోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది లక్ష్మీప్రద, సునీత, రోజా, ఆశ వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటికో కరపత్రం

- ఉచిత బూడిద లోడింగ్ కోసం ఉద్యమం ఉధృతం
- కాంట్రాక్టు వద్దు - లోకలే ముద్దు
- ఎన్టీటీపీఎస్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం



ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతున్న ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓవర్స్ సొసైటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉచిత బూడిద లోడింగ్‌కు ఎన్టీటీపీఎస్ యాజమాన్యం ఒప్పుకొని కార్పొరేట్ కంపెనీకి ఇచ్చిన బూడిద లోడింగ్ కాంట్రాక్టును రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదని డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ సభ్యులు అన్నారు. బుధవారం వారు ఇబ్రహీంపట్నం ఖాజీ మాన్యంలో పర్యటించి తమకు ఎన్టీటీపీఎస్ చేసిన అన్యాయాన్ని తెలుపుతూ ముద్రించిన కర పత్రాలను ఇంటింటికీ తిరిగి పంచుతూ వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కోయ వెంకట్రావు, కొండిశెట్టి నాగమల్లేశ్వరరావులు మాట్లాడుతూ, ప్రజల నుంచి తమ ఉద్యమానికి పూర్తి మద్దతు లభిస్తుందన్నారు. డాక్టర్ ఎన్టీటీపీఎస్ సంస్థ నుంచి బూడిద కాలుష్యం వల్ల కొండపల్లి మున్సిపాలిటీలోని కొండపల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి, తుమ్మలపాలెం, గుంటుపల్లి, మూలపాడు, ఈలప్రోలు గ్రామాలో ఉన్న 1.5 లక్షల ప్రజల్లో అనేక మంది రోగాల బారిన పడుతున్నారన్నారు. బూడిద కాలుష్యం వల్ల రోగాల బారిన పడుతున్న స్థానికులకు ఎన్టీటీపీఎస్ వల్ల జరిగిన మేలు కంటే నష్టమే అధికమన్నారు. ఎన్టీటీపీఎస్ సంస్థ వల్ల జరిగిన మేలు ఏదైనా ఉందంటే అది మా లారీలకు, టిప్పర్లకు ఉచితంగా బూడిద లోడింగ్ చేయడమే అన్నారు. ఇప్పుడు దాన్ని కూడా డబ్బులకు కొనుగోలు చేసుకోమనడం మా కడుపుల మీద కొట్టి మమ్మల్ని రోడ్డు పడేయటమే అని వాపోయారు. ఎన్టీటీపీఎస్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వారం నుంచి ఆందోళన చేస్తున్నా ఎన్టీటీపీఎస్ సంస్థ దిగిరావడం లేదన్నారు. స్థానికులకు అన్యాయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని రోజు రోజుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కాంట్రాక్టును రద్దు చేసి ఎప్పటిలాగే బూడిదను స్థానిక లారీలు, టిప్పర్లకు ఉచితంగానే లోడింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హృదయరాజు

బాల్య వివాహాలు జరగకుండా
బాధ్యతగా వ్యవహరించాలి

గంపలగూడెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోసవీడు, అమ్మిరెడ్డిగూడెం, పెదకొమిర గ్రామ సచివాలయాల పరిధిలో, వాసయ్య మహిళా మండలి ప్రతినిధులు బుధవారం బాల్యవివాహాలు నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జె.హృదయరాజు మాట్లాడుతూ, గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా, కమిటీ సభ్యులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. గ్రామస్తులకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పెదకొమిర సర్పంచ్ వేమూల కస్తూరి, మహిళా కానిస్టేబుల్ జి.సరస్వతి, ఎఎన్ఎంలు, ఎం.శివరావు, అంగన్‌వాడి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులపై ఫిర్యాదు



సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘం నాయకులు

మైలవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతు సంఘం నాయకులపై, సీపీఎం గురించి అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రైతు సంఘం నాయకులు సీఐ దాడి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో యూరియా రైతులకు సకాలంలో అదించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేయగా తెలుగుదేశం పార్టీకి చెందిన జి.కొండూరు మండలం కవులూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చెరకూరి గంగాధర్ పేరుతో కమ్యూనిస్టు పార్టీలు అవినీతి పార్టీలని, సీపీఎం నాయకులు పనీపాట లేని నిరుద్యోగులని అవినీతికి చిరునామాగా మారిన ఎర్ర పార్టీ నేతలు అనే వ్యాఖ్యలతో సోషల్ మీడియా గ్రూపుల్లో మల్లి అనే వ్యక్తులు పోస్టులు పేర్ చేయడంపై రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎమ్.వెంకటరెడ్డి, పి.వి.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి మాధవరెడ్డిలు సీఐకు ఫిర్యాదు చేశారు.

యూరియా కొరత లేదు

విస్సన్నపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదని, సమృద్ధిగా యూరియా ఉందని తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి అన్నారు. కలగర సొసైటీ, నర్సాపురంలో యూరియా పంపిణీ విధానాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. రైతులు నానో యూరియా వాడాలన్నారు.

● పుట్రేలలో బుధవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. తహసీల్దార్ కె.లక్ష్మికల్యాణి, ఏఈవో ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల సమావేశం 11న మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అధ్యక్షత నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీతశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులందరూ విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

సూపర్ సిక్స్ పథకాలు .. సూపర్‌గా అమలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చిట్టిబాబు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి సర్కార్ సమర్థవంతంగా అమలుచేస్తూ ప్రజాదరణ పొందుతుందని కొండపల్లి మునిసిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. మంగళవారం రాత్రి కొండపల్లి మున్సిపల్ టీడీపీ కార్యాలయంలో మున్సిపాలిటీ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో బాగంగా మున్సిపాలిటీలోని వార్డుల్లో మెయిన్ కమిటీలను పూర్తి చేశామన్నారు. అనుబంధ సంఘాల నియామకాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈసమావేశంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్స్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో భారీ వర్షం



వరద నీటిలో బస్టాండ్

తిరువూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మధ్యాహ్నం భారీ వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బుధవారం మధ్యాహ్నం వరకు వేసవిని తలపించేలా వాతావరణం ఉండగా, ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకొని మధ్యాహ్నం నుంచి సుమారు మూడుగంటల పాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. స్థానిక బస్టాండ్‌లో భారీగా నీరు చేరడంతో, ప్రయాణికులు, కార్మికులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారి బైపాస్ జంక్షన్ సమీపంలో చీరాల సెంటర్‌లో ప్రధాన రహదారిపై సుమారు మూడు అడుగుల మేర వరద ప్రవహిస్తూ రోడ్లు పంట కాల్వలను తలపించింది.

జూపూడి పేలుడు ఘటనలో
పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు ?

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూపూడి శివారు భీమేశ్వర కాలనీ పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడైన విజయవాడకు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. భీమేశ్వర కాలనీలో కొన్ని కుటుంబాలకు బాణాసంచా (ఉల్లిపాయ బాంబులు) తయారీ వస్తువులను సత్యనారాయణనే ఇచ్చినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ నెల 3న రెంటపల్లి కోటమ్మ ఇంట్లో ఐరన్ గ్రిల్స్ వెల్డింగ్ సమయంలో జరిగిన పేలుడులో అమాయకుడైన దినసరి కూలి కోనాయిపాలెం గ్రామానికి చెందిన గోదా గోపి మృతికి బాణాసంచా తయారీ వస్తువులే కారణంగా తేలడంతో ఆ దిశలో పోలీసులు విచారణ చేపట్టారు. ఇప్పటికే ఈ కేసులో ముద్దాయిలైన కోటమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆమె కుమారుడు మరో ముద్దాయి అవినాష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

హుండీ చోరీ కేసులో ఐదుగురికి జైలు

విస్సన్నపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నర్సాపురంలోని సూర్య దేవాలయంలో 2024లో జరిగిన హుండీ చోరీ కేసులో నలుగురు ముద్దాయిలకు తిరువూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఓ.అనుషా జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. ఏ-1 మానికల వసంతరావుకు ఒక ఏడాది 9 నెలల పాటు, పొన్నూరు రాంబాబు, మానికల రమేష్, మానికల సురేష్‌లకు 9 నెలల చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. ఎస్సైని, కానిస్టేబుల్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క అనారోగ్య సమస్యలు మరో పక్క పని చేయడం లేదని కుటుంబ సభ్యుల చిన్న చూపుతో తీవ్ర మనస్తాపానికి గురైన కొండపల్లి న్యూ ఆర్పీఎం కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ వడ్లమూడి మరియదాసు (37) బుధవారం తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముం దు బంధువులకు వీడియో కాల్స్ చేసి నన్ను చివరి సారిగా చూడండి నేను చని పోతున్నానని చెప్పి తలుపులు మూసుకొని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి మృతుని అన్న నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విహార యాత్రలతో విజ్ఞానం పెంపు

మైలవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్ల రవి అన్నారు. కళాశాల బీఏ విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. విజయవాడలోని బాపూ మ్యూజియంలో ఉన్న ప్రాచీన, మధ్య నవీన రాతి యుగాలలో వాడిన పురాతన వస్తువులు, వివిధ రకాలుగా తయారు చేసిన విగ్రహాలు భారతీయ సాంస్కృతిక వైభవంనకు నిదర్శంగా ఉన్నాయని ప్రతి యొక్క అంశాలను చరిత్ర అధ్యాపకులు డి.శ్రీనివాసరావు భారతీయ పురావస్తు శాఖ మ్యూజియం ప్రాముఖ్యతను విద్యార్థులకు ఆయన వివరించారు.

జాతీయ స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు
అప్పారావు ఎంపిక



ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కంది మళ్ల అప్పారావు జాతీయ స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదర్భంగా కె.అప్పారావును కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

వ్యవసాయ విప్లవానికి నాందిగా
సేంద్రియ వ్యవసాయ డ్రోన్లు

రెడ్డిగూడెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విప్లవానికి నాందిగా సేంద్రియ వ్యవసాయ డ్రోన్లు పిలవనున్నాయని మండల తెలుగు దేశం పార్టీ నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని కూనపరాజుపర్వలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కృషితో వ్యవసాయ డ్రోన్‌ను నాగేశ్వరరెడ్డి, తహసీల్దార్ జె.సుశీలదేవి ప్రారంభించారు. రైతులకు శ్రమ తగ్గించడంలో పంట దిగుబడిని పెంచడంలో ఈ డ్రోన్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జామలపాటి వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ శాఖాధికారి డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

మైలవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన నాలుగు వాహనాల వేలంపాట ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు పూర్తి వివరాల కోసం ఎక్సైజ్ స్టేషన్ మైలవరంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

చాకలి ఐలమ్మ వర్ధంతి

తోటమూల(గంపలగూడెం) : తోటమూల రింగ్ సెంటర్‌లో బుధవారం రజక చైతన్య సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రటానికి పూలమాలలే వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమ్మరపు ఆదినారాయణ, నాగారపు కృష్ణ, పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న యువతి బంధువులు

యువకునిపై కేసు

విస్సన్నపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వడిత్యా శ్రీను అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు. తాతకుంట్లకు చెందిన వడిత్యా శ్రీను చంద్రుపట్ల పెద్ద తండాకు చెందిన 19 ఏళ్ల యువతిని గత కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. అయితే పెళ్లి చేసుకోమని యువతి శ్రీనును కోరగా అందుకు అతను నిరాకరించాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం పోలీస్‌స్టేషన్ ముందు బైటాయించి న్యాయం చేయాలని ఆ యువతిని పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేశారు. కొద్ది సేపు అనంతరం తిరువూరు వెళ్లి సీఐ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. యువతి ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌షాపుల్లో విజిలెన్స్ దాడులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని పలు రేషన్‌షాపుల డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారని వెల్లువెత్తుతున్న ఫిర్యాదులతో విజిలెన్స్ అధికారులు బుధవారం ఏకకాలంలో కొండపల్లి, ఇబ్రహీంపట్నంలలో పలు రేషన్ షాపులపై దాడులు నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని రేషన్ షాపు నంబరు 34లో విచారణ చేపట్టారు. రాత్రి పొద్దుపోయే వరకు దాడులు కొనసాగుతునే ఉన్నాయి. 34లో బియ్యంలో వ్యత్యాసం గుర్తించి, షాపును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- 17 నుంచి రిలే నిరసన కార్యక్రమాలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ తెలుగునాడు కాంట్రాక్టు కార్మిక సంఘం (కె-215), తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం (బి-1245) ఆధ్వర్యంలో బుధవారం చీఫ్ ఇంజనీర్ శివ రామాంజనేయులు, డీఎస్ వెంకటేశ్వర్లకు డిమాండ్ నోటీసులు అందించారు. తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని, రిలే నిరాహార దీక్షలు చేస్తామని డిమాండ్ నోటీసులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు, ఆలపాటి శివనాగేశ్వరరావు, పి.వి సత్యనారాయణ, స్వతంత్ర కుమార్ దర్శనపు, షేక్ జాని షరీఫ్, జొన్నలగడ్డ రాజేష్, క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.545

వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు

పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండెపు దశరధ జనార్దన్ ఆధ్వర్యంలో పెనుగంచి ప్రోలులోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో బుధ వారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు 1500 మంది రోగులు సద్విని యోగం చేసుకున్నారు. వీరిలో ఆర్థోపెడిక్ జనరల్ విభాగంలో 595 మంది కంటి పరీక్షలు నిర్వహించగా కళ్ళ జోళ్ళను 501 మందికి వైద్యులు ఎంపిక చేశారు. పలువురు కార్పొరేట్ వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రముఖులు వేగినేటి గోపాలకృష్ణమూర్తి, చింతల వెంకట సీతా రామయ్య, కట్టా వెంకట నరసింహారావు, గజ్జి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డులో చెత్తశుద్ధి చేసేందుకు వచ్చిన యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, ఛైర్మన్ రాఘవేంద్ర

డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా ఏపీ

» ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దేశంలో ప్రప్రథమంగా డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చెప్పారు. రాష్ట్రంలో పలు పట్టణాల్లో డంపింగ్ యార్డులలో పేరుకుపోయిన చెత్తను శుద్ధిచేసే ప్రక్రియకు జిల్లాలో జగ్గయ్యపేటలో శ్రీకారం చుట్టిందని చెప్పారు. పట్టణంలో విలియంపేట డంపింగ్ యార్డులో లెగసీ చెత్తను శుద్ధి చేసేందుకు వచ్చిన యంత్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. నెల రోజుల్లో ఈ చెత్తను శుద్ధి చేస్తుందని ఛైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. ఆయన వెంట కమిషనర్ తులసీ వెంకట కృష్ణారావు, డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ డి.హను మంతురావు తదితరులు పాల్గొన్నారు.

బలుసుపాడులో వ్యవసాయాధికారుల పర్యటన



రైతులకు అవగాహన కలిగిస్తున్న శాస్త్రవేత

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రస్తుత పరిస్థితులలో సమతుల్య యాజమాన్య పద్ధతులతో దిగుబడులలో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని గరికపాడు కె.వి.కె కో-ఆర్డినేటర్ రవికిషోర్ పేర్కొన్నారు. బలుసుపాడు గ్రామంలో కె.వి.కె శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పర్యటిం చారు. వరి, పత్తి, తదితర పంటలను వారు పరిశీలించారు. వరిలో పొటాషియం నివారణకు 20 కిలోల ఎంవోపీని అందించాలని సూచించారు. నానో యూరియా ప్రాముఖ్యత ప్రస్తుత పరిస్థితులలో దానిని వినియోగించుకోవటంతో పాటు ఉపయోగాలను వివరించారు. పత్తిలో పూత, పిందె రాలుతుందని తెలపగా పోషక లోపాల కారణంగా రాలుతుందని మెగ్నీషియం, జింకు, బోరాక్స్ స్ప్రే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రోగులకు కళ్లజోళ్ల అందజేత



కళ్లజోళ్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ జనార్దన్

నందిగామ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు, రామిరెడ్డిపల్లి గ్రామాలలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి బుధవారం మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ కళ్లజోళ్లు అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే సదుద్దేశ్యంతోనే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈవో చెరుకూరు చాముండేశ్వరీ, వైద్యులు నాదెళ్ల వేణు, కేతినేని శైలజ, వరుణ్, రమ్య నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, అబ్బూరి వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో మొక్కుబడిగా సబ్సిడీ ఉల్లి



రైతుబజార్‌లో విక్రయిస్తున్న కర్నూలు ఉల్లిపాయలు

» బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.30ల పైనే
» ఆచరణలోకి రాని రేషన్‌షాపుల్లో విక్రయాలు

(ఆంధ్రజ్యోతి - జగ్గయ్యపేట)

బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధర పెరిగిపోతుంది. ఒక వైపు కర్నూలు ఉల్లి కొనేవారు లేక కుళ్లిపోతున్నా ప్రజలకు మాత్రం ఉల్లిపాయలు సరసమైన ధరకు దొరకటం లేదు. జగ్గయ్యపేట రైతుబజార్‌లో ఉల్లి కేజీ రూ.28లకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.30 వరకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర ఉల్లి ధర హోల్‌సేల్ మార్కెట్‌లో కేజీ రూ.16లకు దొరుకుతుండగా రవాణా, హమాలీ చార్జీలతో కలుపుకుని హోల్‌సేల్‌గా రూ.20లు వరకు విక్రయిస్తున్నారు. రిటైల్‌లో అదే ఉల్లిని రూ.30లకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు స్థానికంగా మహారాష్ట్ర ఉల్లికే డిమాండ్ ఉందని వాటినే తెప్పిస్తున్నారు. ప్రభుత్వం రైతుబజార్లలో కేజీ రూ.12ల చొప్పున సబ్సిడీ ధరపై ఒక్కరోజు విక్రయించారు. స్టాకు అయిపోయిందంటూ రెండు రోజులుగా నిలిపివేశారు. అదే రైతుబజార్‌లో రూ.25 నుంచి రూ.27 వరకు ఉల్లి అమ్ముతున్నారు.

ఒకవైపు కర్నూలు రైతులు ఉల్లిని కేజీ రూ.5లకు విక్రయించేందుకు ముందుకు వచ్చినా కొనే నాథుడు లేక పారబోస్తుంటే, ఇక్కడ కేజీ రూ.25 నుంచి రూ.30లకు కొనలేక ప్రజలు అల్లాడుతున్నారు. రేషన్ షాపుల్లో ఉల్లి అందుబాటులో ఉంచుతామని, ఎన్ని కేజీలైనా ఇస్తామని చేసిన ప్రకటన కార్యరూపం దాల్చలేదు. రేషన్ షాపులకు వచ్చి ప్రజలు ఉల్లిపాయలు ఉన్నాయా? అని అడిగి వెళ్తుండటంతో డీలర్లు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుబజార్, రేషన్‌షాపుల్లో ఉల్లి విక్రయాలు ప్రారంభిస్తే ఇటు రాష్ట్రంలో ఉల్లి రైతులతో పాటు, సామాన్య ప్రజలకు ఉపశమనం లభిస్తుంది.



ఆటోల్లో అమ్ముతున్న వ్యాపారులు

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని చిల్లకల్లు ఐసీడీఎస్ సీడీపీవో సత్యవతి పేర్కొన్నారు. పెనుగంచిప్రోలులోని పడమర బజారున వేంచేసి ఉన్న కోదండ రామాలయం కళ్యాణ మండపంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సును సీడీపీవో సత్యవతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కో ఆర్డినేటర్ అధికారి లక్ష్మీ భార్గవి మాట్లాడుతూ మిషన్ వాత్సల్య బాల్య వివాహాలు, హెల్ప్‌లైన్ నెంబర్లు చట్టాల గురించి వివరించారు. డీసీపీవో రాజేశ్వరరావు మాట్లాడుతూ పోక్సో చట్టం వన్ స్టాప్ సెంటర్ గురించి వివరించారు. ఈకార్యక్రమంలో న్యాయవాది కిరణ్ కుమార్, స్వప్న, డాక్టర్ నాగమణి, సూపర్వైజర్లు , అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో సత్యవతి

వైసీపీ నేతలపై కేసు

నందిగామ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా రైతు పోరుబాట పేరుతో వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన దర్నాలో పాల్గొన్న 20 మంది నేతలపై నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఈనెల 9న అనుమతి లేదని హెచ్చరించినా వైసీపీ నాయకులు దర్నా చేపట్టారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి జన సమీకరణ చేసి నందిగామ తరలించారని చెప్పారు. పోలీసు హెచ్చరికలను బేఖాతరు చేస్తూ దౌర్జన్యంగా పట్టణంలోకి ప్రవేశించినట్లు తెలిపారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, మల్లాది విష్ణు తదితరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వై.వి.వి.ఎల్. నాయుడు తెలిపారు.

14న హిందు న్యాయవాదుల ధర్మసమ్మేళనం



సమ్మేళనం పోస్టర్లు విడుదల చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో ఈనెల 14న పూజ్య స్వామిజీల ఆధ్వర్యంలో హిందు న్యాయవాదుల ధర్మ సమ్మేళనంను జయప్రదం చేయాలని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు న్యాయవాదులు పిలుపునిచ్చారు. సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. దేవాలయ భూముల పరరక్షణకు, హిందు ధర్మంపై జరుగు అన్యాయపూరిత దాడులు ప్రతిఘటించేందుకు తగు కార్యాచరణ ఈ సమ్మేళనంలో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సామినేని వెంకటేశ్వరరావు, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, గోనెల వెంకటేశ్వర్లు, టీఎల్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు

హిందువులపై దాడి హేయం : గోకరాజు

కంచికచర్లరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల మండలం పరిటాలలో వినాయక నిమజ్జనం సందర్భంగా హిందువులపై జరిగిన దాడి హేయమైన చర్య అని గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు గోకరాజు గంగరాజు అభివర్ణించారు. కంచికచర్ల మండలంలోని పరిటాల గ్రామంలో వినాయక చవితి సందర్భంగా వినాయక శోభయాత్రలో రాళ్ళ దాడి జరిగిన ఘటనలో గాయపడిన బాధితులను పరిమర్శించేందుకు రాష్ట్ర గణేష్ ఉత్సవ కమిటీ విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన జాతీయ రాష్ట్ర నాయకులు బుధవారం పరిటాల గ్రామానికి చేరుకున్నారు. ముందుగా రాళ్ళ దాడిలో గాయపడిన బాధితులను పరిమర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఆరోగ్య వివరాలను క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పరిటాల సాయిబాబా గుడి వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో గోకరాజు గంగరాజు మాట్లాడుతూ హిందువులపై జరిగిన దాడి హేయమైన చర్యగా వర్ణించారు. గాయపడిన హిందువులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారని దాడి చేసిన వారి ఇళ్ళపైకి వెళ్లలేదని సంయమనం పాటించిన హిందువులు పైనే తిరిగి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయడం చాలా దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ సైతం జరిగిన సంఘటనపై పూర్తి వివరాలు తీసుకున్నారు. వారం రోజులలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గంగారాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగ ప్రసాద్, గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కారదర్శి పాకాల త్రినాథ్, ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి వలివర్తి దుర్గా ప్రసాద్, కోశాధికారి వెంకటరమణ, నందిగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పిట్టల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరవరం జడ్పీ పాఠశాలలో బుధవారం లయన్స్ ఇంటర్నేషనల్ ఎనిమిది, తొమ్మిది, 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కలిగించినట్లు హెచ్‌ఎం సూర్యకుమారి తెలిపారు. లయన్స్ క్లబ్ నందిగామకు చెందిన డాక్టర్ యర్రంరెడ్డి గాంధీ భవిష్యత్ లక్ష్యాలను పాఠశాల స్థాయి నుంచి అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, కవిత, రాజేష్, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కలిగిస్తున్న క్లబ్ ప్రతినిధులు

రైతు సంక్షేమానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే తాతయ్య

నందిగామ రూరల్ : రైతు సంక్షేమానికి కృషి చేయటంతో పాటు సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజ గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని కొణతమాత్మకూరు సొసైటీ అధ్యక్షునిగా చెరుకూరు సాంబశివరావు, సభ్యులు దగ్గుపాటి నిర్మల, కాంబోజి కొండాల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, చెరుకూరు హైమారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

జగ్గయ్యపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో డీపీఆర్ నగర్‌లో సీఐటీయూ మండల 8వ మహాసభల్లో మండల అధ్యక్షురాలు సుధారాణి అధ్యక్షతన జరిగింది. సభలో ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, పంచాయతీ, ఆటో, ముఠా, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు, హాకర్స్ వంటి అసంఘటిత కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు. మండల అధ్యక్షులుగా డి.సుధారాణి, కార్యదర్శిగా గౌస్‌మియా, కోశాధికారిగా బత్తుల బుజ్జి, 21 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు.

13న మెగా లోక్ అదాలత్

నందిగామ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నందిగామ కోర్టు ప్రాంగణంలో ఈనెల 13న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు 16వ జిల్లా అదనపు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ వి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.గోపి ఆదేశాల మేరకు నిర్వహించే ఈకార్యక్రమంలో కక్షిదారులు తమ కేసులకు సత్వర పరిష్కారం పొందాలని ఆయన సూచించారు.

పాము కాటుకు రైతు మృతి

జగ్గయ్యపేటరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చిల్లకల్లు గ్రామానికి చెందిన నల్లగట్ల నాగేశ్వరరావు (65) పశువులకు గడ్డి కోస్తుండగా పాము కరిచి మృతి చెందాడు. వెంటనే బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వాళ్లు వచ్చి చూసేసరికి అప్పటికే ప్రాణాలు విడిచాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వంద పడకల వైద్యశాల శంకుస్థాపనకు కలెక్టర్‌కు ఆహ్వానం

నందిగామ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నందిగామలో నిర్మిస్తున్న 100 పడకల వైద్యశాల శంకుస్థాపనకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియాలతో సహా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేపూరి నాగేశ్వరరావు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈనెల 12న జరిగే ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని వారిని కోరారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ సత్యనారాయణ, డాక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ లక్ష్మీశకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న వేపూరి

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా 'మద్దుకూరి'

నందిగామ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ప్రముఖ ఆడిటర్ మద్దుకూరి సాయి బాబును నియమించారు. బుధవారం ఆపార్టీ విడుదల చేసిన జాబితాలో సాయిబాబుకు స్థానం దక్కింది. వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న సాయిబాబుకు పదవి లభించడం పట్ల పలువురు వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తన పట్ల నమ్మకంతో పార్టీ అధిష్ఠానం ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.



అగ్ని ప్రమాదంలో కాలిన స్పేర్ పార్ట్స్

చిల్లకల్లులో అగ్ని ప్రమాదం

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకల్లు గ్రామంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదానికి గురైన వినాయక ఆటోమొబైల్స్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. జగ్గయ్యపేటకు చెందిన విజయ్ ఆటోమొబైల్‌తో పాటు సర్వీసింగ్ సెంటర్‌ను మండల కార్యాలయం సమీపంలో నిర్వహిస్తున్నారు. రాత్రి షాపు మూసి తాళాలు వేసి వెళ్లిన తరువాత దుకాణం దగ్ధమవుతుందనే సమాచారంతో అక్కడకు వచ్చేసరికి పూర్తిగా ఆహుతైందని రూ. 30 లక్షల విలువ చేసే సామాను దగ్ధమైందని ఎమ్మెల్యేకు వివరించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు యంత్రాలతో మంటలను అదుపు చేశారు. నాలుగు బైకులు, రూ. లక్షలాది విలువ చేసే సామాను, టైర్లు, స్పేర్ పార్ట్స్, ఆయిల్ కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం సంభవించి ఉంటుందని సమాచారం. శ్రీరాం చిన్నబాబు, రావూరి విశ్వనాధం, శ్రీనివాసరావు, అశోక్, వెంకటేష్, తదితరులు దుకాణ యజమానిని పరామర్శించారు.